PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 121 | విజయవాడ, మంగళవారం 3 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 3 December 2024 | Rs

విశాఖ డెయిరీ ముట్టడి

- పాల సేకరణ ధర పెంచాలని డిమాండ్
- ప్రధాన గేట్లు ఎక్కి కార్యాలయం లోపలకు దూసుకెళ్లిన పాల రైతులు
- పోలీసులు అడ్డగింతతో ఉద్రిక్తత

2

మద్యం అక్రమాలపై రూ.5 లక్షల ఫైన్

- రెండోసారైతే లైసెన్స్ రద్దు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మద్యం విక్రయాల్లో అక్రమాలకు పాల్పడే వారి విషయంలో భారీ జరిమానా, కఠిన చర్యలు తీసుకునేందుకు ఎక్సైజ్‌శాఖకు అధికారాన్ని ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నోటిఫికేషన్‌ను ఎక్సైజ్‌శాఖ కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా సోమవారం విడుదల చేశారు. మద్యంపై ఎంఆర్‌పి కంటే అధిక ధరలు వసూలు చేస్తే మొదటిసారి రూ.5 లక్షల జరిమానా విధిస్తారు, రెండోసారి ఇటువంటి చర్యలకు పాల్పడితే షాపు లైసెన్స్ రద్దు చేస్తారు. మద్యం షాపు దక్కించుకున్న వ్యాపారులు, తమకు కేటాయించిన షాపు పరిధిలో బెల్టు షాపులను నిర్వహించినా, ప్రోత్సహించినా మొదటిసారి రూ.5 లక్షల జరిమానా విధిస్తారు. రెండోసారి ఇటువంటి చర్యలకు పాల్పడితే షాపులైసెన్స్ రద్దు చేస్తారు. ఇందుకోసం 1968 ఎక్సైజ్ చట్టంలోని 47(1) సెక్షన్‌కు సవరణ చేస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ

- కాకినాడ పోర్టు వ్యవహారంపై డిజిపి నేతృత్వంలో కమిటీ
- శాంతి భద్రతలు, అదాని అంశం, నామినేటెడ్ పోస్టులపై చర్చ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం చంద్రబాబు నాయుడుతో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన కాకినాడ పోర్టు నుంచి పిడిఎస్ బియ్యం పెద్దయెత్తున అక్రమంగా విదేశాలకు తరలిపోతున్న అంశంపై ఫోకస్ పెట్టారు. డిజిపి నేతృత్వంలో కమిటీని వేస్తే బాగుంటుందనే అభిప్రాయానికి వీరిరువురు వచ్చినట్లు తెలిసింది. ఈ అంశాన్ని మంగళవారం జరగనున్న కేబినెట్ సమావేశం అజెండాలో చేర్చాలని నిర్ణయించారు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే వరకు ఆ నౌకను ప్రభుత్వ నియంత్రణలోనే ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా అభిప్రాయపడినట్లు తెలిసింది. రాజధాని అమరావతిలో ఈ నెల 15 నుంచి పనులు వేగవంతం చేయాలని కూడా వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. ఇటీవల పవన్‌కల్యాణ్ ఢిల్లీ పర్యటన చేసిన నేపథ్యంలో అక్కడ విషయాలను ముఖ్యమంత్రితో పంచుకున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి, అధికారులు వ్యవహరిస్తున్న తీరును కూడా పవన్‌కల్యాణ్ వివరించినట్లు తెలిసింది. వీటితోపాటు నామినేటెడ్ పోస్టులను 10, 15 రోజుల్లో భర్తీ చేయాలని కూడా వీరిద్దరూ నిర్ణయించారు. ఇప్పటికే విడతల వారీ భర్తీ చేస్తున్నప్పటికీ ఆశావహుల నుంచి ఒత్తిడులు తీవ్రమవుతున్నాయి. ఈ ప్రక్రియను ఆలస్యం చేస్తే రానున్న రోజుల్లో కూటమి పార్టీలకు రాజకీయంగా కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురుకావచ్చనే అభిప్రాయం కూడా ఈ సమావేశంలో చర్చించుకున్నట్లు సమాచారం. ఇక రాజ్యసభ సీట్ల విషయానికొస్తే జనసేనకు సీటు కేటాయిస్తారా లేదా అనే అంశంపై మరోసారి కూర్చొని నిర్ణయించుకోవాలని సిఎం, డిప్యూటీ సిఎం నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. అలాగే రాజకీయ దుమారం లేపుతున్న అదాని వ్యవహారం, జగన్‌కు ముడుపులు అంశంపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై మంగళవారం జరిగే కేబినెట్‌లో చర్చించిన అనంతరం ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.



5

గర్భిణిని డోలీ మోతతో గెడ్డ దాటిస్తున్న కుటుంబీకులు, స్థానికులు

పాతాళానికి రూపాయి

- డాలర్‌తో మరో 13 పైసల పతనం

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ చరిత్రలో ఎప్పుడూ లేని స్థాయిలో పతనమైంది. సోమవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి 84.73 కనిష్ట స్థాయికి దిగజారింది. దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత బలహీనమైన గణాంకాలు రూపాయి విలువను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. అమెరికాకు ట్రంప్ అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత పరిస్థితి మరింత కఠినంగా మారింది. బ్రిక్స్ దేశాలపై 100 శాతం టారిఫ్ పన్నులు ఉండొచ్చన్న సంకేతాలు రూపాయిని మరింత పడిపోయేలా చేసింది. ఇప్పటికే డాలర్ బలపడటానికి తోడు దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు వరుసగా ఈక్విటీలను తరలించుకుపోతున్నారు.

సెకి లేఖకు ముందే...!

కేబినెట్‌కు ప్రతిపాదనలు సిద్ధం

- సిఎం కార్యాలయ ఆదేశాలే కారణమా?
- 'అదాని' వ్యవహారంలో మరో కీలకాంశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకి) దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన అదాని అవినీతి కుంభకోణంలో రాష్ట్రానికి సంబధించి మరో కీలకాంశం వెలుగులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి)తోనే తాము ఒప్పందం చేసుకున్నామని థర్డ్ పార్టీ ప్రమేయమే లేదని అప్పటి పాలకులు చెబుతున్న విషయం తెలిసిందే. అయితే, ఆ సంస్థ నుండి ఎటువంటి లేఖ రాకముందే సౌర విద్యుత్ ప్రాజెక్టును సెకి ద్వారా చేపట్టడానికి విద్యుత్ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అప్పటికే యూనిట్ రూ.2.49కి సరఫరా చేయడానికి రాష్ట్రప్రభుత్వమే ఏర్పాటు చేసిన గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ (జిఇసిఎల్) బిడ్లను పొంది ఉన్నా, వాటిని పక్కన బెట్టి మరి కొత్తగా ప్రతిపాదనలు రూపొందించడం వెనుక అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయ ప్రమేయం ఉన్నట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం 2021 సెప్టెంబర్ 14వ తేదిన పది గిగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టును సెకి ద్వారా చేపట్టడానికి ప్రతిపాదనల్ని రూపొందించాలని ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ నుండి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ ఆదేశాలు అందిన కొద్ది సేపటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం నుండి కూడా అటువంటి ఆదేశాలే అందినట్లు సమాచారం. కేబినెట్ సమావేశంలో ప్రవేశపెట్టేందుకు వీలుగా ప్రతిపాదనలు రూపొందించాలన్నది ఈ ఆదేశాల సారాంశం. సెకి నుండి ఎటువంటి ఆఫర్ లేకుండానే ప్రతిపాదనలు రూపొందించాలని అత్యున్నత స్థాయినుండి ఆదేశాలు అందడంతో విద్యుత్ శాఖ అధికారుల్లో కొంత గందరగోళం నెలకొన్నట్లు తెలిసింది.



24 గంటల తరువాతే...

అత్యున్నత అధికారుల నుండి ఆదేశాలు అందిన 24 గంటల తరువాత సెప్టెంబర్ 15వ తేదిన సెకి నుండి తొలి ప్రతిపాదనలు విద్యుత్ శాఖకు అందాయి. జిఇసిఎల్ అప్పటికే బిడ్లను పొందిఉన్న రూ.2.49కే యూనిట్ విద్యుత్‌ను సరఫరా చేస్తామని సెకి ఈ ఆఫర్ లెటర్లో పేర్కొంది. మొత్తం 9 గిగా వాట్ల విద్యుత్‌ను సరఫరాచేస్తామని, 2024నుండి 2026 వరకు మూడు సంవత్సరాల పాటు ఏడాదికి 3 గిగావాట్ల సరఫరా చేస్తామని తెలిపింది. ఆ మరుసటి రోజే (సెప్టెంబర్ 16వ తేది) కేబినెట్ సమావేశం ఉండటం, ఆ భేటీ ముందుకే సెకి నుండి కొనుగోళ్ల కు సంబంధించిన ప్రతిపాదనలను పెట్టాల్సి ఉండటంతో విద్యుత్‌శాఖ అధికారులకు ఒక్క రోజు సమయం మాత్రమే మిగిలింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు ఉరుకులు పరుగులు మీద ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. ఆ కొద్ది సమయంలోనే పవర్ కో ఆర్డినేషన్ కమిటీతో సంప్రదించినట్లు, ఆర్థికశాఖ దృష్టికి కూడా తీసుకుపోయినట్లు సమాచారం. ఆ విభాగాలు చేసిన సూచనలను కూడా పొందుపరిచి, దీర్ఘకాల పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, సెకితోచర్చలు జరపాలని, ఆ తరువాత మాత్రమే తదుపరి చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ సూచించింది. కేబినెట్ నోట్ ఫైల్‌లో ఇదే అంశం స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిసింది. అయితే, చర్చల ప్రస్తావనే లేకుండా సెకితో కలిసి ముందుకు వెళ్లాలని అప్పటి ప్రభుత్వం విద్యుత్‌శాఖను ఆదేశించినట్లు సమాచారం.


ఇవీ అనుమానాలు...!

సెకి నుండి ఎటువంటి ప్రతిపాదన అందకముందే ఆ సంస్థతో ఒప్పందానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్న ఆదేశాలు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కారాలయం నుండి విద్యుత్ శాఖకు ఎలా అందాయి?

- ఈ తరహా ఉత్తర్వులు జారీ చేయాలని వారిని ఆదేశించింది ఎవరు?
- అత్యున్నత స్థాయి నుండి ఆదేశాలు లేకుండానే ఉన్నతాధికారులు చొరవ చూపారా? చూపితే వారికి ఆ సమాచారం ఎక్కడిది?
- ఈ ఆదేశాలకు కొద్ది రోజుల ముందు (సెప్టెంబర్ 12వ తేది) గౌతమ్ అదానీ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లికి వచ్చి అత్యంత రహస్యంగా కలిశారు. ఆ భేటీకి ఈ ఆదేశాలకు ఏమైనా సంబంధం. ఉందా?

అదానిపై ప్రధాని మౌనం వీడాలి

- పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన
- నిమిషాల్లోనే ఉభయ సభలు వాయిదా
- రాజ్యాంగంపై చర్చకు ఉభయపక్షాల అంగీకారం : మంత్రి కిరణ్ రిజిజు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదాని ముడుపుల వ్యవహారంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మౌనం వీడాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అదాని గ్రూప్ లంచంపై చర్చించాలని, ఈ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంట్ ఉభయ సభలు సోమవారం కూడా దద్దరిల్లాయి. ప్రభుత్వం చర్చకు ముందుకు రాకపోవడంతో... నిమిషాల్లోనే లోక్‌సభ, రాజ్యసభ మంగళవారానికి వాయిదా పడ్డాయి.

లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. వెంటనే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. అదాని అంశంపై ప్రధాని స్పందించాలంటూ నినాదాలు చేశారు. ప్రతిపక్షాల ఆందోళన నడుమ ప్రశ్న అడిగేందుకు అనంతపురం ఎంపి అంబికా జి లక్ష్మీనారాయణను స్పీకర్ ఓం బిర్లా పిలిచారు. ఆయన ప్రశ్నకు కేంద్ర స్కిల్‌శాఖ మంత్రి జయంతి చౌదరి సమాధానం చెప్పారు. వెంటనే లక్ష్మీనారాయణ అనుబంధ ప్రశ్న అడిగారు. దానికి సమాధానం చెప్పిన తరువాత, సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ కోస్టల్ షిప్పింగ్ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సభను వాయిదా వేశారు.

మరోవైపు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రారంభిస్తూ ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన 20 వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరించారు. అనంతరం సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేసిన ఆయన, తిరిగి ప్రారంభమైన సభను రెండు నిమిషాల్లోనే మంగళవారానికి వాయిదా వేశారు. నాలుగు రోజుల్లో కేవలం 54 నిమిషాలు లోక్‌సభ, 75 నిమిషాలు రాజ్యసభ కార్యకలాపాలు జరిగాయి. శీతాకాల సమావేశాలు ప్రారంభమైన వారంలో... అతి తక్కువ పనిగా నమోదైంది. గత సోమవారం కేవలం ఆరు నిమిషాల పాటే లోక్‌సభ కార్యకలాపాలు మిగతా 7లో

2 వారాల్లో పూర్తి వివరాలివ్వండి

- జగన్ అక్రమాస్తుల కేసులో సిబిఐ, ఇడికి సుప్రీం ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసుల పూర్తి వివరాలను రెండు వారాల్లోగా అందించాలని అత్యున్నత న్యాయస్థానం కోరింది. ఈ మేరకు సిబిఐ, ఇడిని సుప్రీంకోర్టు ఆదేశించింది. జగన్ అక్రమాస్తుల కేసు విచారణ ఏళ్ల పాటు కొనసాగుతోందని డిప్యూటీ స్పీకరు రఘురామ కృష్ణరాజు గతంలో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. విచారణ ఇన్నేళ్లపాటు ఎందుకు ఆలస్యమవుతుందని ధర్మాసనం ప్రశ్నించింది. జగన్ అక్రమాస్తుల విషయంలో పలు కోర్టుల్లో డిశ్చార్జ్, వాయిదా పిటిషన్లు విచారణలో ఉన్నాయని ఇరుపక్షాల న్యాయవాదులు ధర్మాసనానికి తెలిపారు. దీంతో ఈ కేసుకు సంబంధించి వివిధ కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసుల వివరాలు ఇవ్వాలని ఇడి, సిబిఐకు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను డిసెంబర్ 13కు వాయిదా వేసింది.

బియ్యం దొంగ రవాణాపై విచారణ

సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాకినాడ పోర్టు నుండి దొంగ రవాణా అవుతున్న బియ్యంపై విచారణ చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సబ్సిడీ మీద పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం గత అనేక సంవత్సరాలుగా కాకినాడ పోర్టు నుండి లక్షల టన్నుల్లో దొంగ రవాణా అవుతున్నా ప్రభుత్వాలు చూసీచూడనట్లు పోవడం సరైంది కాదని తెలిపారు. తక్షణం సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు అందాల్సిన బియ్యం దారితప్పి వివిధ పద్ధతుల్లో పోర్టుకు చేరుతున్నాయని తెలిపారు. ఇది రేషన్‌షాపుల నుండే నేరుగా వెళుతుందా లేదా సివిల్ సప్లయి బియ్యం దారి తప్పుతున్నదా అనేది తెలుసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. వారం రోజులుగా పోర్టుల్లో మంత్రులు హడావుడి చేస్తున్నప్పటికీ ఇంతవరకు ఒకరిపై కూడా కేసు నమోదు కాలేదని, ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదని పేర్కొన్నారు. సీజ్ చేయాలన్న షిప్పు కూడా ఇంతవరకు సీజ్ కాలేదని తెలిపారు. అన్నీ మాటలకే పరిమితం అవుతున్నాయి తప్ప నిర్దిష్టంగా దొంగ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు ఆస్కారం ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా తక్షణం రేషన్ బియ్యం దొంగ రవాణాను అరికట్టి లబ్ధిదారులకు వాటిని అందేటట్లు చూడాలని, ఎక్కడ నుండి బియ్యం అక్రమ రవాణా అవుతుందో తెలుసుకుని దాన్ని నిరోధించాలని, దొంగ రవాణాను అనుమతిస్తున్న పోర్టు అధికారులపై చర్యలు తీసుకోవాలని, శాశ్వతంగా అరికట్టేందుకు సమగ్ర విచారణ జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యవస్థీకృత నేరంగా బియ్యం అక్రమ రవాణా

- కాకినాడ పోర్టు భద్రతకు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసరు
- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

5

ములుగు ఎన్‌కౌంటర్ బూటకం

- మృతదేహాలను భద్రపర్చాలని కోర్టు ఆదేశం
- హైకోర్టును ఆశ్రయించిన పౌరహక్కుల సంఘం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం ఏటూరునాగారం సమీపంలోని ములుగు జిల్లా చల్పాక అడవుల్లో ఆదివారం తెల్లవారుజామున జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలని హైకోర్టులో పౌరహక్కుల సంఘం సోమవారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. భోజనంలో మత్తు పదార్థాలు కలిపి మావోయిస్టులను కస్టడీలోకి తీసుకున్నారని, ఆ తర్వాత చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపారని పౌరహక్కుల సంఘం న్యాయవాది న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలున్నాయని, కనీసం కుటుంబ సభ్యులకు కూడా చూపించకుండా పోస్టుమార్టం కోసం తరలించారని, ఎన్‌హెచ్‌ఆర్‌సి నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారని కోర్టుకు వివరించారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపించారు. అడవిలో పోలీసుల భద్రత దృష్ట్యా మావోయిస్టుల మృతదేహాలను వెంటనే ములుగు ఆస్పత్రికి తరలించినట్లు కోర్టుకు తెలిపారు. కాకతీయ మెడికల్ కళాశాల వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీసినట్లు చెప్పారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశిస్తూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. ములుగులో పోలీసుల కాల్పుల్లో ఏడుగురు మవోయిస్టులు మృతి చెందిన విషయం విదితమే.



80 శాతం పైగా జనరల్ కేటగిరీ ఆచార్యులే

- ఐఐటి, ఐఐఎంల్లో ఎస్‌సి, ఎస్‌టి అధ్యాపకులు చాలా తక్కువ
- ఆర్‌టిఐ డేటా వెల్లడి

7

డ్రగ్స్ నివారణకు సంయుక్త కమిటీ

- సిఎస్‌ల సమావేశంలో అంగీకారం
- ఆస్తులు అప్పులపై తేలని పంచాయతీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెండు రాష్ట్రాలకు సవాల్‌గా మారిన డ్రగ్స్‌ను నివారించేందుకు సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు నిర్ణయించారు. విభజన సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటైన ప్రధాన కార్యదర్శుల నేతృత్వంలోని కమిటీ సోమవారం మంగళగిరిలోని ఎపిఐఐసి కార్యాలయంలో మొట్టమొదటి సారి సమావేశమైంది. ఈ ఏడాది జూలై 5న సిఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డిలు హైదరాబాద్‌లోని ప్రజావేదికలో జరిపిన భేటీ కొనసాగింపుగా జరిగిన ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాలకు సంబంధించిన వివిధ అంశాలు చర్చకు వచ్చాయి. డ్రగ్స్‌ను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఇరు రాష్ట్రాల అధికారులు చర్చించారు.

డ్రగ్స్ నివారణకు రెండు రాష్ట్రాలకు చెందిన పోలీస్, ఎక్సైజ్ శాఖలతో సంయుక్త కమిటీ వేయాలన్న నిర్ణయానికి వచ్చారు. సాధ్యమైనంత త్వరలో ఈ కమిటీని అధికారికంగా ప్రకటించడానికి అవసరమైన చర్యలను పూర్తి చేయాలని నిర్ణయించారు. దీంతో పాటు మరో రెండు అంశాలపై కూడా ఈ సమావేశంలో ఏకాభిప్రాయం కుదిరింది. రూ.861 కోట్ల మేర లేబర్ సెస్‌ను రెండు రాష్ట్రాల మధ్య పంపకానికి అంగీకారం కుదిరింది. పన్నులు పంపకాలపై ఇరు రాష్ట్రాల శాఖాధికారుల సమావేశమై తుది నిర్ణయానికి రావాలన్న అభిప్రాయానికి వచ్చారు. ఎక్సైజ్ శాఖకు తెలంగాణ చెల్లించిన రూ.81కోట్ల బకాయిల అంశం పరిష్కారమైంది. అదనంగా ఇచ్చిన రూ.81కోట్లు తిరిగి చెల్లించినట్లు ఎపి తెలిపింది. విద్యుత్తు బకాయిలు అంశం ఎటూ తేలలేదని సమాచారం. 9,10 షెడ్యూల్ సంస్థల ఆస్తులు, అప్పులు పంపకాల అంశంపైకూడా ఎటువంటి నిర్ణయానికి రాలేదు. పరిష్కారం కాని వివిధ అంశాలపై మరోసారి భేటీ కావాలని సిఎస్‌లు నిర్ణయించారు. ఈ కీలక భేటీలో ఎపి నుంచి సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌తోపాటు ఆర్థిక శాఖ కార్యదర్శి, హోమ్‌శాఖ కార్యదర్శి, ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి, జెన్‌కో సిఎండి, వాణిజ్యపన్నులశాఖ చీఫ్ కమిషనరు హాజరయ్యారు. తెలంగాణ నుంచి సిఎస్ శాంతకుమారితో పాటు ఆర్థిక, హోమ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.



భేటీ అయిన ఇరు రాష్ట్రాల సిఎస్‌లు, ఉన్నతాధికారులు

మరణించే వరకూ జైలు

- బాలికపై అత్యాచారం కేసులో పోక్సో కోర్టు తీర్పు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బాలికపై అత్యాచారం కేసులో దోషికి మరణించే వరకూ జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తూ ఒంగోలు పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి టి.రాజా వెంకటాద్రి సోమవారం తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కంభంలోని ఓ పాఠశాల విద్యార్థినితో అదే స్కూల్ మ్యాథ్స్ టీచర్ షేక్ మొహమ్మద్ అప్సర్ బాషా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని స్కూల్ ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు అందింది. దీంతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. కొంతకాలం తర్వాత ఒంగోలులో చదువుకుంటున్న ఆ బాలికకు మాయమాటలు చెప్పి 2017 ఆగస్టు 6న హైదరాబాద్, నరసరావుపేటకు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. నిందితుడిపై ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి ఒంగోలు డిఎస్‌పి సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. నేరం నిరూపణ కావడంతో నిందితుడికి పై మేరకు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. బాధితురాలికి రూ. ఏడు లక్షల పరిహారం అందేలా చూడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థను ఆదేశించింది.

డెయిరీ అవకతవకలపై నేడు ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ డెయిరీలో అవకతవకలపై విచారణ నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక సభా సంఘం ఈ నెల 3న సమావేశం కానుందని రాష్ట్ర శాసనసభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ తెలిపారు. వెలగపూడిలోని శాసనసభ మొదటి అంతస్తులో ఉన్న కమిటీ హాలులో ఉదయం 11 గంటలకు కమిటీ సమావేశమవుతుందని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

ఎల్ఇడి లైట్ల ఏర్పాటుపై త్రిసభ్య కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీల్లో ఎల్ఇడి వీధి దీపాల ప్రాజెక్టు కోసం త్రిసభ్య కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. త్రిసభ్య కమిటీలో పిఆర్ అండ్ ఆర్డి కమిషనర్ కృష్ణతేజ, ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ జెఎమ్‌డి చేకూరి కీర్తికి స్థానం కల్పించారు. త్రిసభ్య కమిటీ ఉత్తర్వులు వెలువడిన నాటి నుంచి పది రోజుల లోపు ప్రాజెక్టుకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జగన్‌పై రాజద్రోహం కేసు పెట్టాలి

- మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యుత్తు కొనుగోలు ఒప్పందంలో అదాని నుంచి రూ.1750 కోట్ల ముడుపులు అందుకున్న మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దేశద్రోహం చట్టం కింద కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. వైసిపి హయాంలో అనేక కుంభకోణాలు జరిగాయని, అవి ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని, జగన్ అవినీతి గురించి దేశంలోనే కాకుండా ప్రపంచమంతటా మాట్లాడుకుంటుందని విమర్శించారు. విదేశాల్లో మన దేశం, మన జాతి పరువు పోగొట్టిన జగన్‌పై దేశద్రోహం కేసు పెట్టడంతోపాటు రూ.1750 కోట్లను రికవరీ చేసుకోవాలని కోరారు. కృష్ణపట్నం, మచిలీపట్నం, కాకినాడ, విశాఖపట్నం పోర్టుల నుంచి రూ.50 వేల కోట్ల విలువ చేసే 1.50 కోట్ల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని, నాసిరకం మద్యాన్ని తయారు చేసి ప్రజారోగ్యంతో చెలగాటం ఆడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కుంభకోణాల్లో ప్రభుత్వం త్వరగా విచారణ జరిపించి, నేరస్తులను శిక్షించాలని కోరారు. పేదలకు అందించే సంక్షేమ పథకాల్లో అవినీతికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించేలా చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రాజేష్ పెంధార్కర్

4న పూరీ వేదికగా నేవీ డే వేడుకలు

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న రాష్ట్రపతి

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో ఏటా జరిగే నేవీ డే వేడుకలను తూర్పు నావికాదళం పరిధిలో ఈ నెల నాలుగున ఒడిశాలోని పూరీ వేదికగా నిర్వహించనున్నట్టు తూర్పు నావికాదళ విభాగాధిపతి, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్టు వెల్లడించారు. సోమవారం తూర్పు నావికాదళంలోని ఆఫీసర్స్ మెస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత నావికాదళం జాతీయ సముద్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏటా నిర్వహించే నేవీ డే విన్యాసాలను ఈ ఏడాది కూడా కొనసాగిస్తోందన్నారు. గడిచిన ఏడాది కాలంలో తూర్పు నావికాదళం పలు రకాలైన ద్వైపాక్షిక, చతుర్ముఖ విన్యాసాల్లో పాల్గొందని తెలిపారు. సముద్ర ఉపరితలంపై నిఘా వ్యవస్థను పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నామని, పలు దేశాల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు అంతర్జాతీయ నియమాలను అనుసరిస్తూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ప్రస్తుతం నావికాదళం ఆధ్వర్యాన రూ.12 వేల కోట్లతో పలు నౌకల నిర్మాణ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. 75 శాతం నౌకలను దేశీయ సాంకేతికతతో నిర్మిస్తున్నామని చెప్పారు. నావికాదళం పరిధిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్నామన్నారు. ప్రజల అభ్యర్థన మేరకు 2025 జనవరి నాలుగున విశాఖ వేదికగా మరొకసారి తూర్పు నావికాదళం విన్యాసాలను ఆపరేషన్ డెమో కింద నిర్వహించనున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. అంతకు ముందే ఈ నెల 15న విశాఖ బీచ్ రోడ్ వేదికగా నేవీ మారథాన్ ఉంటుందన్నారు.

విశాఖ డెయిరీ ముట్టడి

- పాల సేకరణ ధర పెంచాలని డిమాండ్
- ప్రధాన గేట్లు ఎక్కి కార్యాలయం లోపలకు దూసుకెళ్లిన పాల రైతులు
- పోలీసులు అడ్డగింతతో ఉద్రిక్తత

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తగ్గించిన పాల సేకరణ ధరను తక్షణమే పెంచాలంటూ విశాఖపట్నం జిల్లా గాజువాక సమీపంలోని విశాఖ డెయిరీని ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం ఆధ్వర్యాన సోమవారం పాల రైతులు ముట్టడించారు. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల్లో రైతుల నుంచి విశాఖ డెయిరీ యాజమాన్యం సేకరిస్తున్న ఆవు, గేదె పాలకు సంబంధించి కనీస ధరలు ఇవ్వాలని పెద్ద పెట్టున నినదించారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం వరకూ జరిగిన ఆందోళనా కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పాడి రైతులు భారీగా పాల్గొన్నారు. డెయిరీ కార్యాలయంలోకి వెళ్లి ఆందోళన నిర్వహించడం.. రైతుల్లో యాజమాన్యం పట్ల పెరిగిన అసంతృప్తికి అద్దం పట్టింది. వర్షాన్ని సైతం లెక్కచేయక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన పాడి రైతులు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ డెయిరీ గేట్లు ఎక్కి ఎండి ఛాంబర్ వద్దకెళ్లి బైఠాయించారు. ఈ క్రమంలో మెయిన్ గేటు నుంచి లోపలకెళ్లేదారిలో రైతులకు, పోలీసులకు మధ్య అరగంటసేపు తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. డెయిరీ చరిత్రలోనే ఇంతవరకూ పాడిరైతులు ఇంత తెగింపు ప్రదర్శించలేదంటూ అక్కడి ఉద్యోగులు చర్చించుకున్నారు.

పాడిరైతుల కడుపు కొట్టడం తగదు
నినాదాలతో దద్దరిల్లిన డెయిరీ ప్రాంగణం

ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ అక్టోబర్ 29న డెయిరీ వద్ద మహా ధర్నా నిర్వహించి యాజమాన్యానికి ఆవు, గేదె పాల ధరలు పెంచాలంటూ వినతిపత్రం ఇచ్చామని, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, ఇలా తాత్సారం చేయడం తగదని అన్నారు. డెయిరీ యాజమాన్యం రైతుల కడుపు కొడుతోందని తెలిపారు. ఆవు పాల ధరను అక్టోబర్ 16 నుంచి రూ.3 తగ్గించి డెయిరీ యాజమాన్యం అమలుచేస్తోందన్నారు. దీంతో పాల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. లీటరు ఆవు పాలకు 3.5 వెన్న శాతంపై రైతుకు రూ.34 చెల్లిస్తున్నారని, అవే పాలను ప్రాసెసింగ్ చేసి వినియోగదారులకు రూ.54కి విక్రయిస్తున్నారని వివరించారు. సేకరణ ధరకూ, విక్రయించిన ధరకూ మధ్య వ్యత్యాసం రూ.20 ఉంటోందని తెలిపారు. దీనిలో పది రూపాయలు రైతులకు ప్రోత్సాహంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే డెయిరీ పాలకవర్గం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి పాల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు, అనకాపల్లి, విశాఖ జిల్లాల నాయకులు కర్రి అప్పారావు, నాయనిబాబు, గనిశెట్టి సత్యనారాయణ, రాంబాబు తదితరులు నాయకత్వం వహించారు.

బోర్డులో చర్చించి నిర్ణయిస్తాం : మేనేజింగ్ డైరెక్టర్ కెవి.రమణ

త్వరలో బోర్డు సమావేశం నిర్వహించి ఆవు, గేదె పాల సేకరణ ధరల పెంపుదలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని డెయిరీ ఎమ్‌డి కెవి రమణ హామీ ఇచ్చారు. రైతుల ఆందోళనకు దిగి వచ్చిన ఆయన దేశంలో ఏయే రాష్ట్రాల్లో ఎంతెంత కనీస ధరలున్నాయో సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా రైతులు, నాయకులు అడ్డుకుని తమకు న్యాయం చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.



విశాఖ డెయిరీ ప్రధాన గేట్లు ఎక్కి లోపలకు వెళ్తున్న పాల రైతులు

దళిత బాలిక హత్యకేసులో నిందితుడి అరెస్టు

- రాజమండ్రిలో పట్టివేత


ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బాలికను అపహరించి హత్య చేసిన ఘటనలో ఎట్టకేలకు నిందితుడు చిక్కాడు. కేసు వివరాలను ఎస్‌పి సతీష్‌కుమార్ సోమవారం మీడియాకు వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం.. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన నరమామిడి నాగరాజు గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి వలస వచ్చాడు. గ్యాస్‌బాయ్‌గా పనిచేస్తూ ఓ బాలిక తల్లితో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. తమకు అడ్డుగా ఉందని భావించి జులై 15న కొత్తరెడ్డిపాలెంలో ఏడవ తరగతి చదువుతున్న బాలికను తన ఇంటికి తీసుకువెళ్లి హత్య చేశాడు. నిందితుడి కోసం తెలంగాణతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పోలీసులు గాలించారు. రాజమండ్రిలోని స్పిన్నింగ్ మిల్లులో నిందితుడు పనిచేస్తుండగా పట్టుకున్నారు. నిందితుడు గతంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో రజనీ అనే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెను కూడా గొంతు నులిమి హత్య చేసి పారిపోయాడని దర్యాప్తులో తేలిందని, 2005లో మరో నేరంలో జైలు శిక్ష కూడా అనుభవించాడని ఎస్‌పి తెలిపారు.

నౌకలో రేషన్ బియ్యం.. చేతనైతే పట్టుకోండి

- మంత్రి పయ్యావుల వియ్యంకుడే ఎగుమతి చేస్తున్నారు : అంబటి ఆరోపణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



కాకినాడ పోర్టు నుంచి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వియ్యంకుడికి చెందిన పట్టాభి ఆగ్రో సంస్థ నైజీరియాకు 42,500 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని ఎంవి కెనస్టర్ అనే నౌక ద్వారా ఎగుమతి చేస్తోందని, చేతనైతే పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ వెళ్లి పట్టుకోవాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు సవాల్ చేశారు. ఈ నౌకలో మరికొన్ని బస్తాలు లోడింగ్ చేయాల్సి ఉండగా..సముద్రంలో అలజడి కారణంగా డీప్ సీ పోర్ట్‌లో ఈ నౌక నిలిచి ఉందని ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పట్టాభి ఆగ్రో సంస్థ ద్వారా ఈ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని, దీనిని తనిఖీ చేయడం ద్వారా పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవడంలో తమ చిత్తశుద్ధిని వారు నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయినా టిడిపి కూటమి నేతలు వైఎస్ జగన్‌ను విమర్శించడం తప్ప వారు సాధించింది శూన్యమన్నారు. మీ వారి అసమర్థతను వైసిపి నేతలపైకి నెట్టి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. సినిమా ఫక్కీలో కాకినాడ పోర్టులో పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ చేసిన విన్యాసాలు చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. బియ్యం అక్రమ వ్యాపారుల నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ముడుపులు ముట్టాయని ప్రజలలో షో చేసేందుకు మళ్లీ కొత్త నాటకానికి తెరతీశారని ఆరోపించారు.

రూ.11,467 కోట్లతో పనులు

సిఆర్‌డిఎ అథారిటీ సమావేశం నిర్ణయం
వరద నివారణ కాలువలు, రిజర్వాయర్లకు నిధులు
నెలాఖరుకు ఐకానిక్ భవనాలకు టెండర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో రూ.11,467 కోట్లతో పనులు ప్రారంభించేందుకు సిఆర్‌డిఎ అథారిటీ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అథారిటీ సమావేశం సోమవారం జరిగింది. దీనిలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో కేటాయించిన టెండర్లను రద్దు చేయడంతోపాటు, కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించాలని నిర్ణయించారు. వరద నివారణకు గాను రిజర్వాయర్లు, కొండవీటి, పాలవాగు కాలువలు నిర్మించాలని నిర్ణయించారు. మొత్తం 23 అంశాలపై చర్చించిన అథారిటీ దాదాపు అన్ని ప్రతిపాదనలను ఆమోదించింది. వాటి వివరాలను మంత్రి నారాయణ మీడియాకు వివరించారు. కీలకమైన భవనాలు, రోడ్లు, సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం అమరావతిని నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పలు కమిటీలు వేసి నివేదిక ఆధారంగా ముందుకెళుతున్నామని పేర్కొన్నారు. 360 కిలోమీటర్ల ట్రంకు రోడ్లలో రూ.2,498 కోట్లతో పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. వరద నివారణకు రూ.1,585 కోట్లతో పాలవాగు, కొండవీటివాగు గ్రావిటీ కెనాల్‌తోపాటు రిజర్వాయర్లు నిర్మిస్తామని చెప్పారు. గెజిటెడ్, నాన్ గెజిటెడ్, క్లాస్-4 ఆలిండియా సర్వీస్ అధికారుల భవనాల పనులను రూ.3,523 కోట్లతో చేపట్టేందుకు అథారిటీ అంగీకరించిందని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ లేఅవుట్లలో రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.3,859 కోట్లతో అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. ఆయా పనులకు వెంటనే టెండర్లు పిలిచి జనవరి నుండి పనులు ప్రారంభిస్తామని వివరించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వీధిలైట్లు, తాగునీరు, ల్యాండ్ షేపింగ్‌ను అంతర్జాతీయ స్థాయిలో చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అసెంబ్లీ, హైకోర్టు భవనాలు డిజైన్లకు టెండర్లు పిలిచామని, డిసెంబర్ నెలాఖరు నాటికి ఐకానిక్ భవనాలకు టెండర్లు పిలుస్తామని వివరించారు. గత ప్రభుత్వం రైతులను అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టిందని, మహిళలను కూడా హింసించారని తెలిపారు. అమరావతిలో రాజధాని ఉండకూడదని ప్రయత్నాలు చేశారని చెప్పారు. ఐదుకోట్ల మందికి ఇచ్చిన మాట ప్రకారం రాబోయే మూడేళ్లలో అమరావతిని పూర్తి చేస్తామని వివరించారు.

అనుమతించిన పనులు ఇవే..

అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్‌లో భాగంగా మధ్యలో నిలిచిపోయినా గెజిటెడ్ ఆఫీసర్ల అపార్టుమెంట్ల పూర్తికి రూ.594.54 కోట్లు మంజూరుకు ఆమోదం తెలిపారు. మౌలిక వసతుల కల్పన కోసం రూ.226 కోట్లు కేటాయించారు. ఎన్‌జిఒ ఇళ్ల వద్ద పనులకు రూ.594 కోట్లు, ఆలిండియా సర్వీసు అధికారులకు సంబంధించి 115 బంగ్లాల పనుల పూర్తికి రూ.516 కోట్లకు అథారిటీ ఆమోదించింది. ప్రిన్సిపల్ సెక్రటరీలు, కార్యదర్శుల కోసం జిప్లస్ వన్ విధానంలో భవనాల నిర్మాణానికి రూ.274 కోట్లు కేటాయించారు. 13 ఎల్‌పిఎస్ జోన్లలో రూ.8,496 ఎకరాల్లో వసతుల కల్పన కోసం రూ.3,859 కోట్లను వెచ్చించేందుకు అథారిటీ ఆమోదించింది. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును రూ.984 కోట్లతో చేపట్టనుంది. దీనిలో 12 టవర్లను జిప్లస్ 18 అంతస్తుల పద్ధతిలో నిర్మించనున్నారు. 190 ప్లాట్లు మినహాయించి 1,200 ప్లాట్లు అమ్మనున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి గతంలో సిఆర్‌డిఎ ఇచ్చిన టెండర్లను పూర్తిగా రద్దు చేశారు. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వరద నివారణ పనులు, గ్రీనరీ పనులకు గతంలో ఇచ్చిన టెండర్లన్నీ రద్దు చేశారు.

వరద నివారణ పనుల్లో భాగంగా ప్యాకేజీ-1లో రూ.590 కోట్లు, ప్యాకేజీ-2లో రూ.386 కోట్లు, ప్యాకేజీ-3లో రూ.608 కోట్లు కలిపి మొత్తం రూ.1,585 కోట్లను ఖర్చు చేసేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. ముఖ్యంగా ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వరదనీటి యాజమాన్యం, గ్రీనరీ వర్కులకు సంబంధించి వరల్డ్ బ్యాంకు, ఎడిబితో జరిగిన ఒప్పందం మేరకు కన్సల్టెంట్‌ను నియమించేందుకు అథారిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, ఎడిసి ఛైర్మన్ లక్ష్మీపార్థసారధి, సిఆర్‌డిఎ కమిషనర్ కాటంనేని భాస్కర్, ఉన్నతాధికారులు కాంతిలాల్ దండే, శశిభూషణ్‌కుమార్, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

త్వరితగతిన పంటల ఎన్యుమరేషన్

- తుపానుపై సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారీ వర్షాలు కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, అందుకు అవసరమైన ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఫెంగల్ తుపాను ప్రభావం, ప్రభుత్వ సహాయక చర్యలపై అధికారులతో సిఎం సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. వర్షం కారణంగా తడిచిన ధాన్యం ఉంటే రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని సిఎం సూచించారు. వర్షాల ప్రభావం పూర్తిగా తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా తుపాను ప్రభావంతో జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. గత ఐదు రోజుల్లో తుపాను ప్రభావంతో మొత్తం 31 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, ఇందులో తిరుపతి జిల్లాలో 178, చిత్తూరు జిల్లాలో 93, అన్నమయ్య జిల్లాలో 65 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 53 మండలాల్లో తుపాను ప్రభావం ఉందని, భారీ వర్షాలు ఉన్న ప్రాంతాల్లో రిలీఫ్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి ప్రజలను తరలించినట్లు అధికారులు తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 6,824 హెక్టార్ల మేర వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. ఈ సమీక్షలో సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గౌతంరెడ్డి కేసు డైరీ వివరాలివ్వండి

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి నాయకుడు పి గౌతమ్‌రెడ్డిపై నమోదైన హత్య కేసు డైరీలోని వివరాలతో అఫిడవిట్ లేదా మెమో దాఖలు చేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. మంగళవారం విచారణ చేస్తామని జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ ప్రకటించారు. విజయవాడ, సత్యనారాయణపురం పోలీసులు తనపై నమోదు చేసిన హత్యయత్నం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ గౌతమ్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ జరిపారు. ఇప్పటికే న్యాయమూర్తి... తదుపరి ఉత్తర్వుల జారీ వరకు పిటిషనర్‌పై కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు.

వర్మకు ఊరట

ప్రజాశక్తి-అమరావతి

సోషల్ మీడియా పోస్టులు అనుచితంగా ఉన్నాయని చెప్పి సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మపై కఠిన చర్యలు తీసుకోరాదని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 9కి వాయిదా వేస్తూ జస్టిస్ నూనేపల్లి హరినాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాంగోపాల్ వర్మ గతేడాది అక్టోబర్‌లో వ్యూహం సినిమా రిలీజ్ నేపథ్యంలో ట్విట్టర్‌లో పెట్టిన పోస్టులు చంద్రబాబు, పవన్, లోకేష్ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయంటూ ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలం, గార్లపాడుకు చెందిన ముత్తనపల్లి రామలింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా, తుళ్లూరు, అనకాపల్లి జిల్లా, రావికమతం పోలీస్ స్టేషన్లలోనూ కేసులు నమోదయ్యాయి.

వేర్వేరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయడాన్ని వర్మ సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ ఈ నెల 12కు వాయిదా పడింది.



ఒంగోలులో ఓ వ్యాపారికి సంచికను అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వాస్తవాలు చెప్పడం 'ప్రజాశక్తి' కే సాధ్యం

- 'అవినీతి కిలాడీలు' సంచికకు ప్రజల్లో విశేష స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు

'అవినీతి కిలాడీలు.. రక్షణలో పాలకులు' పేరుతో 'ప్రజాశక్తి' ప్రచురించిన ప్రత్యేక సంచికకు ప్రజల్లో విశేష స్పందన వస్తోంది. ఈ సంచికను ఒంగోలు నగరంలో ప్రజాసంఘాల నాయకులు షాపుషాపునకు తిరిగి విక్రయించారు. విద్యుత్ భారాలపై ఇప్పటికే అసంతృప్తితో ఉన్న వ్యాపారులు.. ఆ భారాలకు కారణాలు, కారకులైన వారి గురించి ప్రచురించడం పట్ల 'ప్రజాశక్తి'ని అభినందించారు. ఇలాంటి కథనాలు, వాస్తవాలు ప్రచురించటం 'ప్రజాశక్తికే సాధ్యమని కితాబిచ్చారు. సోమవారం నాడు ఒంగోలులోని కర్నూలు రోడ్డు, గాంధీ రోడ్డు, ట్రంక్ రోడ్డు, పత్తివారి వీధి, తదితర ప్రాంతాలలో వ్యాపారులకు ఈ ప్రత్యేక సంచికల విక్రయాలు నిర్వహించారు. మంచి ఆదరణ లభించింది.



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

విద్యుత్ భారాలు రద్దు చేయకపోతే ఉద్యమం

- సబ్‌స్టేషన్ ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ

ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను రద్దు చేసుకోకపోతే మరో పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ హెచ్చరించారు. ట్రూ అప్ ఛార్జీల పేరిట ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడ రాణిగారితోట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయవద్దని, కుంభకోణాలకు పాల్పడిన అదానీని అరెస్ట్ చేయాలని, విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకించాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కాశీనాథ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమిషన్ (ఇఆర్‌సి) పేరుతో రూ.15,484 కోట్ల విద్యుత్ భారాలను రాష్ట్ర ప్రజలపై మోపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంపై నెపం నెట్టి ప్రజల నెత్తిన రూ. వేల కోట్ల భారాలు వేయడం దుర్మార్గమన్నారు. సిపిఎం తూర్పు నగర కమిటీ కార్యదర్శి పి.కృష్ణ మాట్లాడుతూ.. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు తమ్మిన చంద్రశేఖర్, నగర నాయకులు డి.వరప్రసాద్, ఎన్.నాగేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కోర్టు వద్ద వామపక్ష నాయకులు

వామపక్ష నాయకులపై దివీస్ కేసులు కొట్టివేత

ప్రజాశక్తి- కోటనందూరు (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా తొండంగి మండలం కోన ప్రాంతంలో 2016లో జరిగిన దివీస్ ఉద్యమంలో వామపక్ష నాయకులపై పెట్టిన కేసులను న్యాయమూర్తి కొట్టివేశారు. కాలుష్య కారకమైన దివీస్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించిన సిపిఎం, సిపిఐ నేతలపై యాజమాన్యం ఫిర్యాదు మేరకు తుని రూరల్ పోలీసులు అప్పట్లో రెండు కేసులను నమోదు చేశారు. ఒక కేసులో ఎనిమిది మందిని, మరో కేసులో ఐదుగురిని నిందితులుగా పేర్కొన్నారు. సిపిఎం జిల్లా నేతలు దువ్వా శేషబాబ్జి, ఎం.వేణుగోపాల్‌లను ఈ రెండు కేసుల్లోనూ చేర్చారు. వీరితోపాటు అప్పటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య, జి.బేబిరాణి, కమిడి సత్యశ్రీనివాస్, ఎం.వేణుగోపాల్, పెంట్యాల నర్సింహారావు, కూరాకుల సింహాచలం, వీరలక్ష్మి, వెంకటలక్ష్మి, సత్యవతిలతో సహా మొత్తం 11 మందిపై పోలీసులు అప్పట్లో కేసు పెట్టారు. తుని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో విచారణ కొనసాగింది. వాద, ప్రతివాదనల అనంతరం సోమవారం తుది తీర్పు వెలువడింది. పోలీసులు సరైన ఆధారాలు చూపలేకపోవడంతో ఈ కేసును కొట్టివేస్తూ అడిషనల్ జూనియర్ జడ్జి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వర్ణలత తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు పట్ల సిపిఎం నాయకులు కుంచె చిన్న, జి.అప్పారెడ్డి, కరణం విశ్వనాథం, షేక్ పద్మ, నక్కిళ్ల శ్రీను హర్షం వ్యక్తం చేశారు.

మెట్రోరైలు ప్రాజెక్ట్ డిపిఆర్‌కు ఆమోదం

- విశాఖ మొదటి దశకు రూ.11,498 కోట్లు
- విజయవాడ మొదటి దశకు రూ.11,009 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నం, విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టులకు సంబంధించి తొలిదశ డిపిఆర్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో తొలిదశలో 46.23 కిలోమీటర్లు మేర 3 కారిడార్లను నిర్మించనున్నారు. ఇందుకు రూ.11,498 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. మొదటి కారిడార్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి కొమ్మాదికి 34.40 కిలోమీటర్లు, రెండవ కారిడార్‌లో గురుద్వార నుంచి పాత పోస్టాఫీసుకు 5.08 కిలోమీటర్లు, మూడవ కారిడార్‌లో తాడిచెట్లపాలెం నుంచి చినవాల్తేర్‌కు 6.75 కిలోమీటరు మేర ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకు డిపిఆర్‌లో ప్రతిపాదించారు. రెండవ దశలో కొమ్మాది నుంచి భోగాపురం వరకూ 30.67 కిలోమేటర్ల మేర మెట్రోరైల్ ప్రాజెక్టును నిర్మించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. విజయవాడలో మెట్రోరైల్ రెండు దశల్లో చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి దశలో భాగంగా కారిడార్ 1(ఎ) గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్ వరకూ, కారిడార్ 1(బి) పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పెనమలూరు వరకూ ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నారు. రెండు కారిడార్‌లు కలిపి 38.40 కిలోమీటర్ల మేర ప్రతిపాదించారు. ఇందుకు రూ.11,009 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందుకు సంబంధించిన భూసేకరణకు రూ.1,152 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. రెండవ దశలో పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి అమరావతి వరకూ 27.75 కిలోమీటర్ల మేర మూడవ కారిడార్‌లో భాగంగా నిర్మాణం చేపట్టనున్నట్లు డిపిఆర్ సిద్ధం చేశారు. ఈ మేరకు పురపాలకశాఖ కార్యదర్శి కన్నబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రోరైల్ డిపిఆర్‌ను కేంద్రానికి పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పోలీసు ఆఫీసర్ల కేసు 12కు వాయిదా

అమరావతి : నటి కాదంబరి జత్వానీ ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో పోలీసులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ల విచారణ 12కు వాయిదా పడింది. ఐపిఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీ, పోలీసు ఉన్నతాధికారులు హనుమంతరావు, సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు వేర్వేరుగా వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ల తరపు న వాదనలు పూర్తయ్యాయి. సిఐడి పోలీసుల వాదనలను ఈ నెల 12న విచారిస్తామని జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ ప్రకటించారు.

రేషన్ బియ్యం తరలింపుపై దర్యాప్తు

- పిసిసి అధ్యక్షురాలు షర్మిల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రేషన్ బియ్యం విదేశాలకు తరలించడంపై ప్రత్యేక దర్యాప్తు కమిటీని నియమించాలని, లేనిపక్షంలో సిబిఐ విచారణ కోరాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోరారు. రాష్ట్రాన్ని రేషన్ బియ్యం మాఫియాకు అడ్డాగా మార్చారని చెప్పారు. రేషన్ బియ్యం వ్యవహారంపై సోమవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద మాఫియా ఉందని, ఇదొక జాతీయ స్థాయి కుంభకోణంగా పేర్కొన్నారు. పేదల పొట్టకొట్టి రూ.48 వేలకోట్లు సొమ్మును తినేశారని ఆరోపించారు. గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలోని రెండు పోర్టుల నుంచి రెండు కోట్ల టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా అయ్యిందంటే ఇక్కడి చెక్ పోస్టుల పనితీరు ఎలా ఉందో అంచనా వేయొచ్చని చెప్పారు. అక్రమ రవాణా వెనుక ఉన్న బియ్యం దొంగలెవరో తేల్చాలని కోరారు.



కలెక్టరేట్ ఎదుట వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణం ఎదుట ఓ వృద్ధురాలు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితులు తుమ్మల హైమావతి కథనం ప్రకారం.. మనుబోలు మండలం వీరంపల్లి గ్రామానికి చెందిన ఆమెకు మూడెకరాల పొలాన్ని వేరే వారికి రూ. మూడు లక్షలకు తాకట్టు పెట్టారు. రుణగ్రస్తులను బెదిరించి 2014లో అదే గ్రామానికి చెందిన గోనుపల్లి ప్రభాకర్ ఆక్రమించుకున్నాడు. దీనిపై విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని పలుమార్లు జిల్లా అధికారులకు, పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. వివాదంలోని భూమిని సాగు చేయరాదని ఎస్ఐ చెప్పినా లెక్కచేయకుండా ప్రభాకర్ పొలం పనులు ప్రారంభించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై కలెక్టరేట్ ఆవరణలో పెట్రోల్ పోసుకొని హైమావతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ముందుగానే పసిగట్టిన సెక్యూర్టీగార్డు పెట్రోల్ బాటిల్‌ను లాక్కొన్నాడు.

వరి, ఉద్యాన పంటలకు భారీ నష్టం

- నేలకొరిగిన అరటి, టమోటా, మొక్కజొన్న
- రాయలసీమ, విశాఖ, నెల్లూరులో చిరుజల్లులు

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను తిరుపతి, కడప జిల్లాల్లో తీవ్ర నష్టాన్ని కలిగించింది. వరి, చెరకు, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. మొక్కజొన్న, అరటి, టమోటా పంటలు నేలకొరిగాయి. వరి మడుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. నష్టపరిహారాన్ని అంచనా వేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రకాశం జిల్లా పాకలలో సముద్రపు అలలు ఎగిసిపడుతున్నాయి. కడప, తిరుపతి, విశాఖ, కర్నూలు, నెల్లూరులో సోమవారం మోస్తారు వర్షాలు కురిశాయి.



అన్నమయ్య జిల్లా రాయచోటిలో నేలకొరిగిన టమోటా పంట

తిరుపతి జిల్లాలోని పలు రెవెన్యూ డివిజన్లలో వర్షం కారణంగా నీట మునిగిన పంట పొలాలను, చెరువులను, స్వర్ణముఖి ఆనకట్టను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. సూళ్లూరుపేటలో 150 ఎకరాల వరి పంట నీట మునిగిందని ఆయన తెలిపారు. ఏర్పేడు మండలం రాజుల కండ్రిగ ప్రైమరీ స్కూలు ఉపాధ్యాయుడు రత్నకుమార్.. రేణిగుంటల నుంచి రాజుల కండ్రిగకు వెళ్లేందుకు గోవిందవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది కల్వర్టును ద్విచక్రవాహనంతో దాటేందుకు ప్రయత్నించడంతో అదుపు తప్పి వరదలో కొట్టుకుపోయారు. గమనించిన స్థానికులు తాళ్ల సహాయంతో ఆయనను రక్షించారు. చిత్తూరు జిల్లా సోమల మండలంలోని 15 పంచాయతీలలో వరి నేలకొరిగింది. వర్షపు నీరు నిలిచి రైతులకు అపార నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ తెలిపారు. సదుం మండలంలో 25 ఎకరాల వరి పంట నీట మునిగింది. వెదురుకుప్పం మండలంలో చెరకు పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. అన్నమయ్య జిల్లాలో వరి, మొక్కజొన్న, అరటి, టమోటా, చామంతి పూల తోటలు, బీన్స్ తదితర పంటలు నీట మునిగాయి. ఆయా పంటలకు సుమారు. రూ.1.54 కోట్లు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. 55 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. కడప జిల్లాల్లో చిరుజల్లులు పడ్డాయి.

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో రోజంతా ముసురు వాతావరణం నెలకొంది. పలు చోట్ల చిరు జల్లులు పడ్డాయి. నంద్యాల, కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిశాయి. శ్రీశైలంలో ఓ మోస్తారు వర్షం పడింది. నెల్లూరులో జల్లులు పడ్డాయి. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల సముద్ర తీర ప్రాంతంలో అలల ఉధృతి అధికంగా ఉంది. కెరటాలు ఉవ్వెత్తున్న ఎగిసిపడుతున్నాయి. వారం రోజులుగా మత్స్యకారులెవ్వరూ సంద్రంలోకి వెళ్లలేదు. అలల దాటికి వలలు, బోట్లను మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

జగన్ నేతృత్వంలోనే రేషన్ మాఫియా

- మాజీ మంత్రి కెఎస్ జవహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండ్‌కో నేతృత్వంలోనే రేషన్ మాఫియా ఆగడాలు అని మాజీ మంత్రి కెఎస్ జవహర్ విమర్శించారు. పేదల ఇంట్లో ఉండాల్సిన రేషన్ బియ్యం కాకినాడ పోర్టులో కనిపిస్తోందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ బియ్యం స్మగ్లింగ్‌కు కాకినాడ పోర్టును అడ్డాగా మార్చారని విమర్శించారు. అంతర్జాయతీ రేషన్ స్మగ్లర్లు, వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు జగన్ ఆదేశాలతో గత ఐదేళ్లలో లక్షల టన్నుల రేషన్ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసి వేలకోట్లు కూడబెట్టుకున్నారని విమర్శించారు. ఒకరోజులో ఇక్కడి నుంచి 11 వందల లారీల బియ్యం అక్రమంగా తరలిపోతోందంటే స్మగ్లింగ్ ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. బియ్యం లారీలను తనిఖీ చేసేందుకు కేవలం 11 మంది సిబ్బంది ఉన్నారని, వైసిపి పాలనలో ఉద్దేశపూర్వకంగా సిబ్బందిని తగ్గించారని విమర్శించారు. బియ్యం స్మగ్లింగ్ మాఫియా నెట్‌వర్క్‌ను కూకటి వేళ్లతో పెకిలించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కాకినాడ పోర్టులో భద్రతా చర్యలు బలహీనంగా ఉంటే భవిష్యత్తులో ఆర్‌డిఎక్స్, మారణాయుధాలు, డ్రగ్స్ కూడా దిగుమతి అయ్యే అవకాశం ఉందన్నారు.

హోమియోపతి మెడికల్ ఆఫీసర్లుగా ఎంపికైన వారి జాబితా విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆయుష్‌శాఖ (హోమియోపతి)లోని మెడికల్ ఆఫీసర్ (ఎంఒ) పోస్టులకు ఎంపికైన 52మంది అభ్యర్థుల జాబితాను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) విడుదల చేసింది. అభ్యర్థుల జాబితాను psc.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు కమిషన్ కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆటోను ఢీకొన్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు

- ఇద్దరు దుర్మరణం
- ఆరుగురికి తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-కాశినాయన (కడప జిల్లా)

కడప జిల్లా పోరుమామిళ్ల కాలువకట్ట సమీపంలో సోమవారం ఆటోను, ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలిరించారు. పోలీసులకథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం పాపాయిపేట నుంచి కడపకు ఆటో బయలుదేరింది. ఆటో డ్రైవర్ అక్కడక్కడ ప్రయాణికులను ఎక్కించుకున్నారు. పోరుమామిళ్ల కొమరోలు ప్రధాన రహదారి కాలువకట్ట వద్దకు రాగానే ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో పోరుమామిళ్ల మండలం రామేశ్వరానికి చెందిన సుబ్బయ్య ఆచారి (65), అక్కిల్ రెడ్డిపల్లికు చెందిన రోశయ్య (64) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆటో డ్రైవర్‌కు, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడినవారందరిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్రైవర్‌కు, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల్ని విచారించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. దీంతో బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బియ్యం రవాణాపై పవన్ డ్రామా

- ప్రజలపై విద్యుత్ భారాలు అంగీకరించం
- ఎమ్మెల్సీ బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని అంగీకరించబోమని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం డిసెంబర్ నుంచి ప్రజలపై రూ.6,072 కోట్ల ట్రూ అప్ ఛార్జీల భారం వేస్తోందని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు హామీ ఇచ్చారని, దీనిని విస్మరించి ప్రతి యూనిట్‌కు సగటున రూ.1.25 పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. ఫిబ్రవరి తర్వాత మరో రూ.9,412 కోట్ల భారం మోపబోతున్నారని, మొత్తంగా రూ.15,485 కోట్ల విద్యుత్ భారం వేస్తున్నారని తెలిపారు. ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే సబ్సిడీగా భరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తోందని, దీనిపై పార్టీ విధానాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు



నెలల్లో రూ.67,237 కోట్ల అప్పులు చేసిందని, ఇంత అప్పు చేస్తున్న ప్రభుత్వం ట్రూ అప్ భారాన్ని భరించలేదా? రూ.15,485 కోట్లును డిస్కంలకు చెల్లించలేదా? అని ప్రశ్నించారు. కాకినాడ పోర్టులో బియ్యం రవాణాపై డిప్యూటీ పవన్ డ్రామా నడిపాడని, కాకినాడ ఎమ్మెల్యేను ప్రశ్నించిన పవన్.. తన టిడిపి కూటమి మంత్రే ఆ శాఖకు ప్రాతినిథ్యం వహిస్తున్నట్లు మర్చిపోయారని మీడియా ప్రతినిధులు అడిగిన ఓ ప్రశ్నకు బొత్స సమాధానమిచ్చారు. బియ్యం రవాణాపై సంబంధిత మంత్రి తనిఖీలకు వెళ్లొచ్చుగానీ డిప్యూటీ సిఎం ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. తన మంత్రిపై అనుమానంతో కూడా అక్కడకు వెళ్లి ఉండవచ్చునని, డిప్యూటీ సిఎం చిత్తశుద్ధి ఏమిటో త్వరలోనే బయటకు వస్తుందన్నారు. పోర్టులో బియ్యం ఎగుమతులపై వ్యాపారులతో బిజెపి నేతలు సమావేశాలు నిర్వహించడం, ఢిల్లీకి తీసుకువెళ్లి మరీ అనుమతులు ఇప్పించడం వాస్తవం కాదా ? అని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.

ప్రజలపై అదనపు విద్యుత్ భారాలు తగవు

- సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజలపై అదనపు విద్యుత్ భారాలు మోపడం ఆపాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. 2023-24 సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ పంపిణీ సంస్థలు రూ.9,412 కోట్ల భారాలు వేయడాన్ని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. విద్యుత్ ఉత్పత్తి కంపెనీలతో చేసుకున్న ఒప్పందాల కంటే అదనంగా బొగ్గు, ఇతర ఇంధనాల ధరలు పెరిగాయనే పేరుతో ఛార్జీలు పెంచుతారని, ట్రూఅప్ ఛార్జీలకు అదనంగా ఇవి ఉంటాయని పేర్కొన్నారు. ఎపిఇఆర్‌సి ఏర్పాటు చేసిన తర్వాత మొట్టమొదటిసారి బహిరంగ విచారణ జరపకుండా నేరుగా సర్దుబాటు ఛార్జీలు పెంచారని, ఇది చట్ట విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదాని వంటి విద్యుత్ సరఫరాదారులతో తప్పుడు ఒప్పందాలు చేసి ప్రజలపై అడ్డగోలుగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచుతుందని విమర్శించారు. విద్యుత్ నిత్యావసర సరుకుగా ఉందని తెలిపారు. ఛార్జీలు ఎంత పెంచినా ప్రజలు భరిస్తారనే ఆలోచనతో అడ్డగోలుగా పెంచడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు ఛార్జీల భారం వేస్తే ఆందోళన చేయడం తప్పదని హెచ్చరించారు.

పవన్ ముఖంతో రాష్ట్రంలో మతోన్మాదం

- లౌకిక ప్రత్యామ్నాయ సంస్కృతిని చాటుదాం
- తిరుపతి జిల్లా మహాసభలో రమాదేవి

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో/శ్రీకాళహస్తి

లౌకిక ప్రత్యామ్నాయ సంస్కృతిని పెద్ద ఎత్తున చాటి చెప్పాలని, ఈ దోపిడీ సమాజానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా సత్యవేడులో సోమవారం జరిగిన సిపిఎం జిల్లా 14వ మహాసభల ముగింపు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరిట రాష్ట్ర ప్రజల నుంచి పన్నులు వసూల్లు చేసి అదానీ, అంబానీకి ధారాదత్తం చేసేలా టిడిపి కూటమి సర్కారు పనితీరు ఉందని అన్నారు. ఇప్పటికే జాతీయ రహదారుల్లో టోల్ ఫీజుల ద్వారా రూ.22 వేలు కోట్లు దోచిపెట్టిన చంద్రబాబు.. జిల్లా రహదారుల ద్వారా ప్రజల టోల్ తీసేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన మద్యం ఇస్తామంటున్న చంద్రబాబు.. నాణ్యమైన విద్యనెందుకు ఇవ్వలేకున్నారని ప్రశ్నించారు. పాఠశాల విద్య ప్రయివేటీకరణలో భాగంగా బ్రిటన్‌తో జగన్ చేసుకున్న ఒప్పందాన్ని టిడిపి కూటమి సర్కారు



మహాసభలో మాట్లాడుతున్న రమాదేవి

ఎందుకు రద్దు చేయడం లేదని నిలదీశారు. తిరుపతిని వాటికన్ సిటీగా తీర్చిదిద్దుతామన్న పాలకులు వెంకన్న చెంత మద్యపుటేర్లు పారిస్తున్నారని ధ్వజమెత్తారు. గుడులు, బడుల వద్ద మద్యం దుకాణాలు వద్దంటూ స్థానిక ప్రజానీకం తిరగబడుతోందని గుర్తు చేశారు. ప్రపంచ దేశాల్లో సామ్రాజ్య వాదం, దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, యువత తిరగబడుతున్నారని చెప్పారు. అధికారం కోసం హిందూత్వం, మతోన్మాదం పేరిట బిజెపి సాగిస్తోన్న కుట్ర రాజకీయాలకు అయోధ్య ఫలితాలు ఓ చెంప పెట్టని, రాజస్తాన్ అజ్మీర్ దర్గా ఉదంతం కూడా దాన్ని నిరూపిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు పవన్ ముఖాన్ని చూపించి, మతోన్మాదాన్ని ప్రేరేపించి ఓట్ల రాజకీయానికి బిజెపి తెరలేపుతోందని అన్నారు. రాష్ట్రానికి ముప్పుగా పరిణమిస్తున్న మోడీ-పవన్ దోస్తీని ప్రజలు తిరస్కరించాలని కోరారు. దేశ ప్రజలు సైతం ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా కమ్యూనిస్టులను చూస్తున్నారని, అందుకు తగ్గట్లుగానే ప్రజల పక్షాన భవిష్యత్ పోరాటాలకు సిపిఎం సిద్ధమవుతోందని స్పష్టం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శిగా వందవాసి నాగరాజు



15 మందితో జిల్లా కమిటీ ఏర్పాటైంది. జిల్లా కార్యదర్శిగా వందవాసి నాగరాజు ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కందారపు మురళీ, అంగేరి పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, దాసరి జనార్ధన్ ఎన్నుకోబడ్డారు.

చమురు ఉత్పత్తులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ రద్దు

న్యూఢిల్లీ : చమురు ఉత్పత్తులపై మోడీ సర్కార్ విండ్‌ఫాల్ టాక్స్‌ను రద్దు చేసింది. పెట్రోల్, డీజిల్, ఎవియేషన్ టర్బైన్ ఫ్యూయల్, ఇతర చమురు ఉత్పత్తుల ఎగుమతులపై విధిస్తున్న విండ్‌పాల్ ట్యాక్స్‌ను రద్దు చేయడం ద్వారా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఒఎన్‌జిసి సంస్థలకు ఆదాయాలు పెరగనున్నాయి. సోమవారం ఈ పన్నులను ప్రధాన మంత్రి కార్యాలయం సమీక్షించి నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం



పట్టడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. చమురు ఉత్పత్తుల ఎగుమతులపై 2022 జులై 1 నుంచి కేంద్రం విండ్‌ఫాల్ టాక్స్ అమలు చేస్తోంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినప్పుడు ఆయా కంపెనీలకు పెద్దఎత్తున లాభాలు వస్తాయి. ఆ సమయంలో విధించే పన్నునే విండ్‌ఫాల్ ట్యాక్స్‌గా పేర్కొంటారు. రెండు వారాల సగటు చమురు ధరల ఆధారంగా ప్రతి 15 రోజులకోసారి ఈ పన్నులను కేంద్రం సమీక్షిస్తోంది. అంతర్జాతీయంగా చమురు ధర గత కొన్ని నెలలుగా 72-75 డాలర్ల మధ్య కదలాడుతోంది.

తెలుగు రాష్ట్రాల్లో పన్ను వసూళ్లు భేష్

- ఇప్పటికే సగం లక్ష్యం పూర్తి
- ఇన్‌కం ట్యాక్స్ అధికారి మిథాలి మధుస్మిత వెల్లడి

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో పన్ను వసూళ్లు మెరుగ్గా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం టాక్స్ మిథాలి మదుస్మిత అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,21,000 కోట్ల ఆదాయపు పన్ను వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే రూ.59,000 కోట్లు వసూళ్లు చేసినట్లు తెలిపింది. గతేడాదితో పోల్చితే తెలంగాణలో 15 శాతం వృద్ధి చోటు చేసుకుందన్నారు. అయితే తెలంగాణతో పోల్చితే ఆంధ్రలో అంత ఆశాజనకంగా లేదన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఎఫ్‌టిసిసిఐ ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో మిథాలి మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో నిర్దేశించుకున్న పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుతామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు రెండు రాష్ట్రాల్లో రూ.2 లక్షల కోట్ల పన్ను వసూళ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందులో కొన్ని వివాదంలో ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోనే భారత్ అత్యంత ప్రగతిశీల పన్ను విధానం గల దేశమన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం, ప్రభుత్వ వ్యయాల కోసం ఎక్కువ ఆదాయాన్ని రాబట్టడం తమ కర్తవ్యమన్నారు.

11 నెలల కనిష్టానికి తయారీ పిఎంఐ

న్యూఢిల్లీ : తయారీ రంగం భారీగా పడిపోనుందని అంచనాలు వెలుపడుతున్నాయి. ఈ ఏడాది నవంబర్‌లో తయారీ రంగ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ)56.5కు తగ్గి 11 నెలల కనిష్టానికి జారనుందని హెచ్‌ఎస్‌బిసి చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ ప్రంజుల్ భండారి పేర్కొన్నారు. ఇంతక్రితం అక్టోబర్‌లో ఇది 57.5గా ఉంది. గడిచిన నెలలో ముడి సరుకుల ధరలు పెరగడం, ద్రవ్యోల్బణం ఒత్తిడి పిఎంఐపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ప్రంజుల్ అన్నారు. పిఎంఐ తయారీ సర్వేలో 400 కంపెనీల అభిప్రాయాలను సేకరిస్తారు. 50 ఎగువన ఉంటే విస్తరణగా.. 50 లోపు ఉంటే ఈ రంగంలో ప్రతికూలత ఉన్నట్లుగా గుర్తిస్తారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

- దళిత సంఘాల ఆందోళన

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం (చిత్తూరు జిల్లా):

చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం మండలం పాతపాళ్యం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. మండలంలో చోటు చేసుకున్న స్థలవివాదం కారణంగా విగ్రహం ధ్వంసం చేశారని దళిత సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కార్వేటి నగరం సిఐ హనుమంతప్ప తెలిపిన వివరాల మేరకు.. పాతపాళ్యం గ్రామంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన చర్చికి దారి సమస్య ఉండేది. అదే గ్రామానికి చెందిన వెంకటముని నాయుడు నుంచి ఒక ఎకరా భూమిని దళితవాడకు చెందిన త్యాగరాజు 20 ఏళ్ల క్రితం కొనుగోళుచేశారు. గ్రామదేవత ఊరేగింపు, చర్చికి వెళ్లడానికీ తాగ్యరాజు కొన్న స్థలం పక్కనే మూడు అడుగులు దారిని గ్రామస్తులు వాడుకునే వారు. ఆ మూడు అడుగుల స్థలం దారికి వదిలేయాని గ్రామస్తులు త్యాగరాజు కుటుంబాన్ని అడిగారు. వారు అంగీకరించకపోవడంతో 2020లో గ్రామస్తులు అందరూ ఆ పొలం పక్కనే అనధికారంగా అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. త్యాగరాజు కుటుంబ సభ్యులు గ్రామస్తులపై తమ పొలానికి వెళ్లే దారిలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారని కేసు నమోదు చేశారు. ఈ వివాదంలో కోర్టుకు గ్రామస్తులు పెనాల్టీ కూడా కట్టారు. ఈ సమస్యపై ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తూ ఉంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గుర్తు



ధ్వంసమైన అంబేద్కర్ విగ్రహం

తెలియని దుండగులు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దీంతో సిఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి కఠినచర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి చర్య తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. కేంద్రంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని పదేపదే చెబుతున్న సందర్భంలో రాజ్యాంగ నిర్మాత విగ్రహాలకు రక్షణ లేకుండా పోతోందని తెలిపారు. గ్రామంలో ప్రజల మధ్య గొడవలు ఉంటే వాటిని న్యాయపరంగా పరిష్కరించుకోవాలి తప్ప విగ్రహాలను ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నించారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై పునఃపరిశీలించాలి

- కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామికి వైసిపి ఎంపిల వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణను పునఃపరిశీలించాలని వైసిపి ఎంపిలు కోరారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామికి కలిసి వైసిపి ఎంపిల బృందం వినతిపత్రం అందజేసింది. ఆంధ్రుల హక్కుగా భావించే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి క్యాప్టివ్ మైన్స్ లేకపోవడం ప్రధాన అడ్డంకిగా మారిందని, ఇదే లాభదాయకతను ప్రభావితం చేస్తుందని తెలిపారు. విశాఖ ఉక్కు టర్నోవర్ సాధించడానికి అవసరమైన చేయూత కేంద్రం అందించాలని కోరారు. మరో రెండేళ్ల పాటు కేంద్రం నుంచి చేయూత అందితే ఆర్థిక పరిస్థితి మెరుగవు తుందని పేర్కొన్నారు. ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడానికి వీలుగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ కేటా యించాలని, ఇది వ్యయ ప్రతికూలతను అధిగమించేందుకు సహాయపడు తుందని అన్నారు. కేంద్ర సహకారం అందిస్తే ప్లాంట్ మళ్ళీ లాభదాయకమైన వెంచర్‌గా మారుతుందని తెలిపారు. తమ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సాను కూలంగా స్పందించారన్నారు. వచ్చే మంత్రివర్గంలో ఈ ప్రతిపాదనలు పెడతానని హామీ ఇచ్చారన్నారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో వైసిపి పార్లమెంటరీ పార్టీ నేత వైవి సుబ్బారెడ్డి, రాజ్యసభ ఫ్లోర్ లీడర్ వి విజయసాయిరెడ్డి, లోక్‌సభ ఫ్లోర్‌లీడర్ పివి మిథున్ రెడ్డి, ఎంపిలు పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మద్దిల గురుమూర్తి, మేడా రఘునాథ్ రెడ్డి, గుమ్మ తనూజా రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఒప్పందాలపై చర్చకు అసెంబ్లీ సమావేశాలు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వం అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, ఈ అంశంపై చర్చించేందుకు ప్రత్యేకంగా శాసనసభ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. విజయవాడలోని దాసరి భవన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఒప్పందాలు, అదాని పేరు ప్రస్తావించకుండా, మాజీ సిఎం జగన్ అవినీతిపై ఎసిబి దర్యాప్తు చేయించాలంటూ ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు చేసిన వ్యాఖ్యల్ని తోసిపుచ్చారు. విద్యుత్ ఒప్పందాల వల్ల రాష్ట్ర ప్రజలపై రూ.1.10 లక్షల కోట్ల భారం పడుబోతుంటే, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రం కొంటున్న విద్యుత్ రాజస్థాన్‌లో ఉత్పత్తి చేయడంతో, ఆ రాష్ట్రంలో 14 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని, పన్నుల రూపంలో ప్రభుత్వానికి రూ.8 వేల కోట్లు ఆదాయం లభిస్తోందని చెప్పారు. ప్రయోజనాలు రాజస్థాన్‌కు కల్పిస్తూ, భారం మాత్రం రాష్ట్ర ప్రజలపై వేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో పరిపాలన నిష్పక్షపాతంగా సాగడం లేదని అన్నారు. కాకినాడ పోర్టు కేంద్రంగా బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ వెళ్లి షిప్‌ను సీజ్ చేయమని ఆదేశించడం హర్షణీయమన్నారు. పక్కనే ఉన్న గంగవరం పోర్టులోనూ ఇదే తంతు జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర అందడం లేదన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా వలంటీర్లకు నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇచ్చేందుకు సిఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి హరినాథరెడ్డి, ఎ వనజ పాల్గొన్నారు.

ట్రంప్ టారిఫ్‌లతో బ్రిక్స్ దేశాలకు ముప్పు

- ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి

హైదరాబాద్ : అమెరికా డాలర్‌కు దూరంగా ఉంటే బ్రిక్స్ దేశాలు 100 శాతం టారిఫ్‌లను ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికను ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు విమర్శించారు. ఈ పరిణామం బ్రిక్స్ దేశాలకు ముప్పులాంటిదన్నారు. ఆర్థిక సవాళ్ల కారణంగా దాని సాధ్యత, చట్టబద్ధతపై మరింత స్పష్టత రావాల్సి ఉందన్నారు. ట్రంప్ టారీఫ్ విధానానికి అమెరికా చట్టం అనుమతిస్తుందో లేదో చూడాలన్నారు. యుఎస్ డాలర్‌కు ప్రత్యామ్నాయాన్ని తీసుకురావడంలో బ్రిక్స్ దేశాల్లో అంతర్గత విభేదాలు ఉన్నాయన్నారు. భారత్, రష్యా, చైనా, బ్రెజిల్‌లను కలిగి ఉన్న తొమ్మిది సభ్య దేశాలు అమెరికా కరెన్సీ ప్రత్యామ్యాయానికి చొరవ తీసుకోవాలన్నారు. బ్రిక్స్‌లోని కీలక దేశాలు రష్యా, చైనా కొన్ని రోజులుగా ప్రత్యామ్నాయాన్ని కోరుతున్నాయన్నారు. భారత్ ఇప్పటి వరకు ఈ చర్యలో భాగం కాలేదన్నారు.

వజ్రాల రంగం సిసిపిఎ ముసాయిదాకు మద్దతు

- నేచురల్ డైమాండ్ ఇండస్ట్రీ

ముంబయి : వజ్రాల రంగంలో వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఉద్దేశించిన సమగ్ర మార్గదర్శకాలను రూపొందించడానికి సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) ఇటీవల వాటాదారులతో సంప్రదింపులు మొదలు పెట్టింది. ఈ రంగంలో నైతిక మార్కెటింగ్ పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా తీసుకొస్తున్న ఈ విధానానికి మద్దతును ఇస్తున్నట్లు నేచురల్ డైమండ్ కౌన్సిల్ ఇండియా మధ్యప్రాచ్య విభాగం ఎండి రిచా సింగ్ తెలిపారు. అన్ని వజ్రాలను ధ్రువీకరించడానికి, లేబుల్ చేయడానికి సిసిపిఎ ప్రతిపాదనకు తాము పూర్తిగా మద్దతు ఇస్తున్నామన్నారు.

సంపాదకీయం


మరిన్ని అయోధ్యలు!

వారణాసి, మథుర వివాదాలకు ఒక వైపు ఆజ్యం పోస్తున్న బిజెపి, సంఘ్ పరివార్ శక్తులు, కొత్తగా ఉత్తరప్రదేశ్‌లో సంభాల్, రాజస్థాన్‌లో అజ్మీర్‌లకు తమ విచ్ఛిన్నకర చర్యలను విస్తరించాయి. సంభాల్‌లో 16వ శతాబ్దం మొఘలుల కాలం నాటి షాహీ జామా మసీదులో సర్వేను ముందుకు తెచ్చాయి. అయోధ్య మాదిరిగానే ఇక్కడ కూడా హిందువుల దేవాలయాన్ని కూల్చేసి మసీదు నిర్మించారని నానా యాగీకి దిగాయి. సర్వేపై స్థానిక జిల్లా కోర్టులో పిటిషన్ వేసి తక్షణ ఆదేశాలు తెచ్చారు. కోర్టు ఉత్తర్వులే తడవు యుపి ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు నవంబర్ 19న తొలి విడత మసీదులో సర్వేకు ఉపక్రమించినప్పుడే స్థానికుల నుంచి వ్యతిరేకత ఎదురైంది. రెండవ తడవ సర్వేకి 24 ఆదివారం భారీ ప్రభుత్వ, పోలీస్ పటాలాలతో చెప్పాపెట్టకుండా విరుచుకుపటంతో స్థానికుల్లో ఆందోళన అధికమై ప్రతిఘటనకు దిగగా నిర్దాక్షిణంగా తుపాకులకు పనిచెప్పి ఐదుగురిని పొట్టనబెట్టుకున్నారు. భాష్పవాయువు, లాఠీఛార్జీలు, బాధితులపైనే తప్పుడు కేసులు, మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష ఎంపి, ఎంఎల్‌ఎల నిర్బంధాలు ఇంటర్నెట్ బంద్, పౌరుల కదలికలపై నిషేధాజ్ఞలతో యోగి సర్కారు అత్యంత దుర్మార్గంగా వ్యవహరించింది. మసీదు నిర్వాహకులు సుప్రీం కోర్టును ఆశ్రయించగా జనవరి 6 వరకు ఎలాంటి సర్వేలు చేపట్టవద్దని ఆదేశించింది. అంతేకాదు, యోగి ప్రభుత్వం, పోలీసులు, అధికారులు తటస్థంగా వ్యవహరించాలని గడ్డి పెట్టింది.

దేశంలో కొద్దిపాటి లోకజ్ఞానం కలిగిన ప్రతి ఒక్కరికీ రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గా ఎరుకే. దర్గా ఏ ఒక్క మతానికో పరిమితం కాదు. జనులందరూ గౌరవిస్తారు. సూఫీల క్షేత్రాల్లో ప్రాశస్త్యమైనది. సదరు దర్గా 12వ మతగురువు ఖాజామొయినుద్దీన్ చిస్తీ వార్షిక ఉరుసు ఉత్సవానికి చాదర్‌ను పంపినట్లు ప్రధాని మోడీ ఇటీవల ప్రముఖంగా ప్రకటించుకున్నారు. ఆ దర్గాను హిందువుల దేవాలయాన్ని పడేసి కట్టారంటూ సర్వే కోసం కోర్టు నుంచి ఆర్డర్ సంపాదించాయి పరివార్ శక్తులు. దీనిపై మోడీ జోక్యం చేసుకొని సర్వేని ఆపించాలని డజను మంది మాజీ అధికారులు, దౌత్యవేత్తలు లేఖ రాసి రోజులు గడుస్తున్నా ప్రధాని నుంచి ఎలాంటి స్పందన లేదు. భక్తి ఉద్యమం, కరుణ, సామరస్యం లక్ష్యంగా పని చేసిన 12వ శతాబ్దం మతగురువు గుడి కూలగొట్టి దర్గా నిర్మించారనే హిందుత్వ శక్తుల వాదన పనిగట్టుకొని విద్వేషాలు రెచ్చగొట్టే పన్నాగమని మతాలకతీతంగా ప్రజలు సులభంగానే అర్థం చేసుకోగలరు.

అయోధ్య వివాదంపై సుప్రీం కోర్టు తుది తీర్పు వచ్చిన సందర్భంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పందిస్తూ అయోధ్య వంటివి దేశంలో ఇంకా చాలా ఉన్నాయని ప్రకటించారు. వారణాసిలో జ్ఞానవాపి, మథురలో షాహీ ఈద్గా, ప్రస్తుత సంభాల్, అజ్మీర్ ఆ కోవలోకే వస్తాయి. పురాతన మసీదుల్లో హిందు దేవాలయాల ఉనికిని కనుగొనేపనిలో సంఘ్ పరివారం పడింది. కింది స్థాయి కోర్టుల్లో పిటిషన్లు వేసి సర్వేలకు అనుమతులు తీసుకొని మత విద్వేష మంటలను ఎగదోస్తోంది. 1991లో తెచ్చిన ప్రార్థనా స్థలాల చట్టం, స్వాతంత్యం నుంచి అన్ని మత ప్రార్థనా స్థలాలపై యథాతథ స్థితి కొనసాగిస్తుంది. ఆ చట్టానికి విరుద్ధంగా కింది కోర్టులు సర్వేలని, మరొకటని ఇష్టానుసారం ఉత్తర్వులిస్తున్నాయి. ఇటువంటి ఉత్తర్వులు రాకుండా సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాల్సి ఉంది. కాగా 2022లో జ్ఞానవాపి కేసు విచారణ సందర్భంగా అప్పటి సుప్రీం చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ 'మత పరమైన స్వభావాన్ని నిర్ధారించడం నిషేధించబడదు' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేసి కందిరీగల తుట్టెను కదిపారు. ఈ వ్యాఖ్యలు మత ఉద్రిక్తతలు రగిల్చే ఎజెండాతో పని చేస్తున్న హిందుత్వ శక్తులకు ఉత్ప్రేరకంగా మారడం ఆందోళనకరం. పదేళ్ల మోడీ జమానాలో మన లౌకిక వారసత్వం, నాగరికతపై దాడి తీవ్రమైంది. చివరికి రాజ్యాంగానికే హాని తలపెట్టాయి. కేంద్రంలో మోడీ సర్కారు, రాష్ట్రాల్లోని బిజెపి ప్రభుత్వాలు అటువంటి విచ్ఛిన్నకర దాడులకు అండదండలందించడం అత్యంత ప్రమాదకరం. ప్రజల మధ్య శాంతి సామరస్యం నెలకొనాలంటే, మైనార్టీలకు రక్షణ, భరోసా దక్కాలంటే విద్రోహ శక్తులను ఒంటరిపాటు చేయాలి. ప్రజల ఐక్యతతోనే సాధ్యం.

మంచి మాట



నిన్న గడిచిపోయింది.
రేపు తెలియదు.
ఈరోజే అన్నింటికంటే విలువైనది.


- గోథే,
కవి, రచయిత.

సందర్భం

పొగడ దొరువు

'భోపాల్' పాఠాలు నేర్చామా...?

భారత పారిశ్రామిక చరిత్రలో మరచిపోలేని విషాద సంఘటనగా మిగిలిన భోపాల్ దుర్ఘటన నుండి పాఠాలు నేర్చుకున్నామా? యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ కక్కిన విషంతో భోపాల్ మృత్యు నగరంగా, శవాల దిబ్బగా మారి 40 ఏళ్లు గడిచిపోయాయి. కానీ, ఇప్పటికీ దాని దుష్ప్రభావాలు వెంటాడుతున్న నేపథ్యంలో అటువంటి దారుణాలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామా? ఈ ప్రశ్నకు సమాధానం లేదనే! సరళీకరణ ఆర్థిక విధానాల నేపథ్యంలో ప్రజల ప్రాణాలకన్నా, పెట్టుబడిదారుల, కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తడమే పాలకులకు ప్రాధాన్యతగా మారింది. భోపాల్ స్థాయిలో కాకపోయినా అచ్చం అదేమాదిరిగా మన రాష్ట్రంలోనూ (విశాఖ) అటువంటి ప్రమాదమే చోటుచేసుకుంది. అదొక్కటే కాదు, ఆ తరువాత కూడా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రమాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. అయినా, పరిశ్రమల అభివృద్ధి కోసం నెత్తురు చిందించే కార్మికులు, వాటి ఏర్పాటు కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసే ప్రజల ప్రయోజనాలను పాలకులు విస్మరిస్తూనే ఉన్నారు. భోపాల్ బాధిత ప్రజానీకం తమ సొంత పట్టణంలోనే కాందిశీకులుగా మారామని విలపిస్తున్నారు. ప్రభుత్వాల విధానాలు ఇలాగే కొనసాగితే మన రాష్ట్రంలోనూ అటువంటి దుస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది.



భోపాల్ దుర్ఘటనకు 40 ఏళ్లు

> నలభై ఏళ్ల తరువాత కూడా భోపాల్ ప్రజలను విషవాయువు దుర్ఘటన ప్రభావాలు వెంటాడుతున్నాయి. రోగ నిరోధక శక్తి గణనీయంగా తగ్గింది. కరోనా విజృంభించిన సమయంలో ఈ విషయం వెల్లడైంది. విషవాయువు ప్రత్యక్ష బాధితులతో పాటు వారి సంతానానిది కూడా ఇదే దుస్థితి. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుండి లీకైన విష వాయువు కారణంగా వేలాదిమంది శ్వాసకోస వ్యాధులకు గురైన సంగతి తెలిసిందే. వీరందరికి రోగ నిరోధక శక్తి కూడా తగ్గడంతో వారి సంతానంపై కూడా దాని ప్రభావం పడినట్లు తేల్చారు. మరోవైపు 1984 గ్యాస్ లీకయినప్పటి నుండి యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో పెద్ద ఎత్తున పడి ఉన్న విష పదార్థాలను ఇప్పటికీ తొలగించలేదు.

భోపాల్‌లో ఏం జరిగింది?

1984 డిసెంబర్ 2వ తేదీ రాత్రి 'యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ' నుండి ఒక్కసారిగా వెలువడిన విష వాయువులు భోపాల్ నగరాన్ని చుట్టుముట్టాయి. ఒక్కసారిగా విష వాయువులు చుట్టుముట్టడంతో ఏం జరుగుతోందో అర్థంకాక, ఊపిరి ఆడక నిద్రలో ఉన్న వారు నిద్రలోనే ప్రాణాలు విడిచారు. విష వాయువుల బారి నుండి ప్రాణాలు కాపాడుకోవడానికి పరుగులు తీసిన వారు రోడ్లపైనే తుది శ్వాస విడిచారు. తెల్లవారే సమయానికి ఎక్కడ చూసినా శవాల కుప్పలతో భోపాల్ మృత్యు నగరంగా మారింది. ఈ దుర్ఘటనలో 10,047 మంది ప్రాణాలు కోల్పోయారని, 5,74,000 మంది విషవాయువుల ప్రభావానికి గురయ్యారని ప్రభుత్వ అంచనా! మృతుల సంఖ్య 15 వేల పైనే ఉంటుందని వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు ప్రకటించాయి. రసాయన పారిశ్రామిక రంగంలో హిరోషిమా అణుబాంబు విస్ఫోటనంతో సమానమైనదిగా ఈ దారుణాన్ని నిపుణులు పోల్చారు. విష వాయువుల దుష్ప్రభావం ఇప్పటికీ వెంటాడుతోంది. ఈ విషాద సంఘటన జరిగిన ఇన్నేళ్ల తరువాత కూడా శిశువులు శారీరక, మానసిక వైకల్యంతో పుడుతూనే ఉన్నారు. భూగర్భ జలాలు విషతుల్యంగానే ఉన్నాయి. నష్టపరిహారం కోసం బాధిత కుటుంబాలు న్యాయస్థానాల చుట్టూ ఇంకా తిరుగుతూనే ఉన్నాయి.

మన రాష్ట్రంలో....!

2020 మే 7వ తేది! మన రాష్ట్రంలోని విశాఖపట్నం ఎల్జీ పాలిమర్స్ విషం చిమ్మిన రోజది! ఫ్యాక్టరీ నుండి లీకైన విష వాయువుతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. పరుగు తీస్తూనే కొందరు ప్రాణాలు వదిలారు. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మరణించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు తుది శ్వాస విడిచారు. 600 మంది ఆస్పత్రి పాలయ్యారు. కొందరు ఇప్పటికీ విషవాయువు ప్రభావాలను అనుభవిస్తూనే ఉన్నారు. దక్షిణ కొరియాకు చెందిన ఈ సంస్థ చిమ్మిన విషంతో ఊళ్లకు ఊళ్లు ఖాళీ అయిపోయాయి. ప్రాణాలరచేతిలో పెట్టుకుని ఐదు గ్రామాలకు చెందిన ప్రజలు ఇళ్లలోంచి రోడ్లపైకి పరుగులు తీశారు. విశాఖతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఆస్పత్రులన్నీ బాధితులతో నిండిపోయాయి. విషవాయువు లీక్ అయిన తరువాత కూడా ప్రమాదాన్ని సూచిస్తూ ఎటువంటి సైరన్ కానీ, అలారం కానీ మోగలేదు. స్థానికుల నుండి సమాచారం అందుకున్న పోలీసులు తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో సైరన్ మోగించినట్లు చెబుతున్నారు. రసాయన విష వాయువును నిద్రలోనే పీల్చిన ప్రజలు శ్వాస ఆడక ఇళ్లల్లోంచి బయటకు పరుగులు తీశారు. ఏం జరుగుతుందో తెలిసే లోపే వీరిలో అనేక మంది వీధుల్లోనూ, రోడ్లపైనా స్పృహ తప్పిపడిపోయారు. ఒళ్లంతా దురదలు, దద్దుర్లు, కళ్ల మంటలకు గురయ్యారు. ఇళ్లల్లో అపస్మారక స్థితిలో పడిపోయి జనం రాలేని స్థితిలో ఉండగా అనేక చోట్ల తలుపులు విరగ్గొట్టి మరీ ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు లోపలకు వెళ్లాల్సి వచ్చింది. దాదాపు 8 వేల మంది గ్రామాలను వదిలి వెళ్లారు.

ఆగని ప్రమాదాలు

ఎల్‌జి పాలిమర్స్ ఘటన జరిగిన మూడు నెలల్లోనే హిందూస్తాన్ షిప్‌యార్డ్‌లో క్రేన్ పడి 11 మంది కార్మికులు మరణించారు. 2022 ఏప్రిల్‌లో ఏలూరు పోరస్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు చనిపోయారు. ఈ ఏడాది జులై నెలలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడలోని అల్ట్రా టెక్ సిమెంట్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా 13 మంది ఆస్పత్రిపాలయ్యారు. అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీ టాగూర్ లాబొరేటరీలో కొద్దిరోజుల క్రితం రసాయన వాయువు లీక్ కావడంతో ఇద్దరు మృతి చెందారు. 2021 నుంచి 2023 జూన్ వరకు కేవలం అనకాపల్లి జిల్లాలోనే 27 పారిశ్రామిక ప్రమాదాలు జరిగాయి. ఫార్మా కంపెనీల్లో జరిగిన ప్రమాదాలే 16 ఉన్నాయి. ఇతర పరిశ్రమల్లో 11 ప్రమాదాలు జరిగాయి. ఇలా చెప్పుకుంటూ పోతే వీటికి అంతే కనపడదు.

ప్రభుత్వాల స్పందనేమిటి?

ఎల్‌జి పాలిమర్స్ ఘటన జరిగిన తరువాతైనా ప్రభుత్వాలు స్పందిస్తాయని, కార్మికుల, ప్రజల భద్రత కోసం చర్యలు తీసుకుంటాయని ఆశించడం సహజం! కానీ జరిగింది వేరు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నీరుగార్చి కోడ్‌లను తీసుకు వచ్చింది. చట్టాలను అమలు చేయాల్సిన కార్మిక శాఖ ఆ పనిలో లేదు. అధికారులు ఫ్యాక్టరీలను తనిఖీ చేయరాదన్న కేంద్ర సర్కారు ఉత్తర్వులతో వారు ఆ పని మరచిపోయి ఎన్నో ఏళ్లు అయ్యింది! కేంద్ర ప్రభుత్వ అడుగులకు మడుగులొత్తడమే లక్ష్యంగా పెట్టుకున్న గత వైసిపి ప్రభుత్వంకానీ, ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం కానీ కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరవడానికి, నిబంధనలను మరింతగా సరళీకరించడానికే పోటీ పడుతున్నారు. ఫలితంగా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. సమీప ప్రాంతాల్లోని ప్రజల ప్రాణాలకు ముప్పుగానే మారుతున్నాయి. పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల గల కారణాలపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు తీసుకోక పోవడంతో పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తు న్నాయని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పరిశ్రమలకు అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం, యాజమాన్యాలు కార్మికులకు రక్షణ చర్యలు తీసుకుంటు న్నాయా? లేదా? అనే అంశాలను పరిశీలించడం లేదని చెబుతున్నారు. 2022లో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీలో రెండు నెలల వ్యవధిలోనే రెండు సార్లు విషవాయువులు లీకై 539 మంది కార్మికులు ఆస్పత్రి పాలయ్యారు. ఈ సంఘటన తరువాత కూడా ఆ సంస్థపై ప్రభుత్వం చెప్పుకోదగ్గ స్థాయిలో చర్యలు తీసుకోలేదు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్‌లో 'భద్రత ఎంత'?

పరిశ్రమల ఏర్పాటే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల 'ఈజ్ ఆఫ్ డూయింగ్'కు బదులుగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను తమ ప్రభుత్వ విధానంగా ప్రకటించారు. ఈ మేరకు నూతన పారిశ్రామిక విధానాన్ని కూడా శాసనసభలో ప్రవేశపెట్టారు. ఆ సందర్భంగా మాట్లాడిన ఆయన రాష్ట్రానికి 35 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను తీసుకు రావడమే లక్ష్యంగా ప్రకటించారు. దీనికోసం అన్ని రకాల ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. సుదీర్ఘంగా సాగిన ఆయన ప్రసంగంలో ప్రైవేటు రంగంలోనే పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేయడం, వాటిని ప్రపంచ స్థాయికి అభివృద్ధి చేయడం, లావాదేవీలను ప్రపంచ స్థాయిలో నిర్వహించడం, పెట్టుబడిదారులకు భూములు, నీరు, కరెంటు వంటివి ప్రభుత్వమే సమకూర్చడం, ఉత్పత్తుల ఎగుమతులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం వంటి అంశాల గురించి సోదాహరణంగా వివరించారు. అయితే, ఎల్‌జి పాలిమర్స్ వంటి ఘటనల గురించి, ఆ ప్రమాదాలకు తక్షణమే బలిపశువులుగా మారే కార్మికుల గురించి. కార్మిక చట్టాల అమలు గురించి, వారి సంక్షేమం గురించి ఆయన నామమాత్రంగా కూడా మాట్లాడలేదు. పారిశ్రామిక ప్రమాదాల నియంత్రణ ఊసే లేకుండా ముఖ్యమంత్రి ప్రసంగం సాగింది. రాష్ట్రానికి విస్తారంగా ఉన్న తీర ప్రాంతాన్ని పరిశ్రమల మయంగా మారుస్తానని కూడా ఆయన చెప్పారు. ఆ పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం నుండి తీర ప్రాంతాన్ని ఎలా రక్షిస్తారో ఆయన చెప్పలేదు. రానున్న రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రమంతా పెద్ద ఎత్తున పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని, రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో ప్రైవేటు పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తామని చంద్రబాబు చెప్పారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంకోసం భూ సేకరణ చట్టానికి బదులుగా, భూ సమీకరణ విధానం అమలు చేయాలని కూడా ఆయన చెప్పినట్లు వార్తలు వచ్చాయి. పరిశ్రమల ఏర్పాటు మంచిదే. కానీ పటిష్ట భద్రతా చర్యలు, కార్మిక చట్టాల అమలుతోనే అవి ఏర్పాటు కావాలి. లేని పక్షంలో కార్పొరేట్ లాభార్జనకు సామాన్యులు సమిధలుగా మారే ప్రమాదం ఉంది.

'స్వాట్'లు ఎందుకు?

భద్రతా చర్యలు, చట్టాల అమలు పట్ల ప్రభుత్వాలకు సరైన దృక్పథం ఉంటే కార్మికుల ఆందోళనలు అణచడమే లక్ష్యంగా ప్రత్యేక దళాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచనే రాదు. కానీ, అనకాపల్లి జిల్లా పోలీసులు దీనికోసమే స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (స్వాట్) టీమ్‌ను ఏర్పాటు చేయడం దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. ఈ టీమ్ సభ్యులు లాంగ్ రేంజ్, షార్ట్ రేంజ్ షెల్స్, స్మోక్ షెల్స్, గ్యాస్ గన్ ఫైర్ చేయడం వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా భద్రతా చర్యలు ఏమాత్రం తీసుకోకుండా విష వాయువుల కర్మాగారాలను ఏర్పాటు చేస్తూ, వాటికి కార్మికులను, ప్రజలను బలిచేస్తూ, తాము మాత్రం ఎక్కడో సురక్షితంగా ఉంటూ, విలాసాలలో మునిగి తేలుతున్న కార్పొరేట్ యాజమాన్యాల కోసం ఇటువంటి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

భోపాల్‌లో ఇప్పటి పరిస్థితి ఏమిటి?

నలభై ఏళ్ల తరువాత కూడా భోపాల్ ప్రజలను విషవాయువు దుర్ఘటన ప్రభావాలు వెంటాడుతున్నాయి. రోగ నిరోధక శక్తి గణనీయంగా తగ్గింది. కరోనా విజృంభించిన సమయంలో ఈ విషయం వెల్లడైంది. విషవాయువు ప్రత్యక్ష బాధితులతో పాటు వారి సంతానానిది కూడా ఇదే దుస్థితి. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుండి లీకైన విష వాయువు కారణంగా వేలాదిమంది శ్వాసకోస వ్యాధులకు గురైన సంగతి తెలిసిందే. వీరందరికి రోగ నిరోధక శక్తి కూడా తగ్గడంతో వారి సంతానంపై కూడా దాని ప్రభావం పడినట్లు తేల్చారు. మరోవైపు 1984 గ్యాస్ లీకయినప్పటి నుండి యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో పెద్ద ఎత్తున పడి ఉన్న విష పదార్థాలను ఇప్పటికీ తొలగించలేదు. వీటిని తొలగించాలని ఈ ఏడాది ప్రారంభంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆదేశాలు జారీ చేసింది. కానీ, అమలు అంతంత మాత్రమే.

ప్రాంగణంలోని మరో 23 చోట్ల ప్రధాన వ్యర్థాలను పూడ్చివేశారని, ప్లాంటుకు సమీపంలో ఉన్న ఒక చెరువులో కూడా వేల టన్నుల విష వ్యర్థాలను పూడ్చిపెట్టారని చెబుతున్నారు. వీటిని కూడా వెలికితీసి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్మూలించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ వ్యర్థాల ఉనికిని ప్రభుత్వం ఇంకా నిర్ధారించాల్సి వుంది. అంటే, ఈ సమస్య పరిష్కారం కావడానికి ఇంకా ఎన్ని తరాలు మారాలో, ఎందరు ప్రజలు నష్టపోవాలో ఊహించుకో వాల్సిందే! ఈ ఏడాది ప్రారంభంలో భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో పేరుకు పోయిన విషపూరిత రసాయనిక వ్యర్థాలను తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎన్‌జిటి ఆదేశాలు జారీ చేసింది. అయితే, అమలు అంతంత మాత్రమే! ఫలితంగా భూగర్భ జలాలు పెద్ద ఎత్తున కలుషితమయ్యాయి. ఈ నీటిని తాగిన వారు అనేక రోగాల బారిన పడుతున్నారు. విష వాయువు బారిన పడిన ఒక మహిళ అప్పటి నుండి ఇప్పటి వరకు (నలభై సంవత్సరాల కాలంలో) 150 కిలోల ఔషధాలు వాడినట్లు ఒక వార్తా సంస్థకు చెప్పారు. అటువంటి దుస్థితి మన రాష్ట్ర ప్రజలకు రాకూదని ఆశిద్దాం..! ★

సందర్భం

ఐఎస్‌టిఎస్ చార్జీలు, నష్టాల మినహాయింపుపై

మోడి ప్రభుత్వ టోకరా


అదాని విద్యుత్‌ను రాజస్థాన్ నుండి సెకి ద్వారా కొనుగోలు చేసే ఒప్పందాన్ని, ధరను సమర్థించుకునేందుకు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, డిస్కాంలు, ఎపిఈఆర్‌సి చేసిన వాదనలలో రాజస్థాన్ నుండి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వరకు జరిగే సరఫరాకు పిజిసిఐఎల్‌కు చెల్లించాల్సిన అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీలను (ఐఎస్‌టిఎస్) చెల్లించనవసరం లేకుండా కేంద్ర ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిందనేది ఒకటి. అదేవిధంగా, ఆ క్రమంలో వాటిల్లే ప్రసార నష్టాల నుండి కూడా మినహాయింపు ఇచ్చిందనేది మరో వాదన. అంటే, ప్రసార నష్టాలను తగ్గించకుండా రాష్ట్రానికి పూర్తిగా అదాని విద్యుత్ సరఫరా జరుగుతుందని దీని అర్థం. అందువల్ల అదాని విద్యుత్ కొనుగోలు లాభదాయకమని వాదించారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని షరతులతో పేర్కొన్న గడువులో నెలకొల్పే సౌర, పవన, మరికొన్ని ప్రాజెక్టులకు ఇలాంటి మినహాయింపులను ఇస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. 25 ఏళ్ళ పాటు ఈ మినహాయింపు ఉంటుందని ఉత్తర్వులలో పేర్కొన్నారు. అయితే, ఆ ఉత్తర్వులలో ఈ ప్రసార చార్జీలు, నష్టాలకయ్యే వ్యయాన్ని ఎవరు భరించాలనేది స్పష్టం చేయలేదు. మోడి ప్రభుత్వం అలాంటి వ్యయాన్ని పిజిసిఐఎల్‌కు సర్దుబాటు చేయటం లేదు.



ఎం. వేణుగోపాలరావు

పిజిసిఐఎల్‌కు చెల్లించాల్సిన చార్జీలను కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సిఇఆర్‌సి) నిర్ణయిస్తుంది. ఆ యా రాష్ట్రాలలోని డిస్కాంలు ఇతర రాష్ట్రాలలోని విద్యుత్ ప్రాజెక్టుల నుండి కొనుగోలు చేసే విద్యుత్‌ను ప్రసారం చేసేందుకు అవసరమైన ప్రసార సామర్థ్యానికి పిజిసిఐఎల్‌తో కాంట్రాక్టు చేసుకుంటాయి. ఆ సామర్థ్యం మేరకే అవి సిఇఆర్‌సి నిర్ణయించిన ఐఎస్‌టిఎస్ చార్జీలను చెల్లిస్తాయి. అయితే, సిఇఆర్‌సి ఈ విధానాన్ని మార్చి, ఒక ప్రసార ప్రాజెక్టును నెలకొల్పిన ప్రాంతంలోని రాష్ట్రాల డిస్కాములు అవి పిజిసిఐఎల్‌తో కాంట్రాక్టు చేసుకున్న ప్రసార సామర్థ్యానికే గాకుండా, ఆ ప్రాంతంలోని ప్రసార ప్రాజెక్టు సామర్థ్యానికి అవసరమైన ఐఎస్‌టిఎస్ చార్జీలను చెల్లించాలని రెగ్యులేషన్ తెచ్చింది. గత సంవత్సరాలలో సంబంధిత డిస్కాం ఎక్స్ఛేంజిల ద్వారా, మార్కెట్‌లో కొనుగోలు చేసిన విద్యుత్‌ను కూడా పరిగణనలోకి తీసుకుని ఐఎస్‌టిఎస్ చార్జీలను నిర్ణయించే జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ (జిఎన్‌ఎ) రెగ్యులేషన్ జారీ చేసి, దాని ప్రకారం చార్జీలను నిర్ణయిస్తున్నది. అయితే, మోడి ప్రభుత్వం పైన పేర్కొన్న ఐఎస్‌టిఎస్ చార్జీలు, ప్రసార నష్టాల మినహాయింపులను ఎలా సర్దుబాటు చేయాలనే అంశాన్ని రెగ్యులేషన్‌లో, తన చార్జీల ఉత్తర్వులలో సిఇఆర్‌సి దాటవేసింది. వాటికయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలని ఎక్కడా పేర్కొనలేదు. సిఇఆర్‌సి అడ్డగోలు విధానాన్ని సవాలు చేస్తూ పలు రాష్ట్రాల డిస్కాంలు దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయపరమైన వివాదాలు నడుస్తున్నాయి.

మోడి ప్రభుత్వం, సిఇఆర్‌సి ఇలాంటి మోసపూరిత వైఖరులతో వ్యవహరించటం వల్ల, ప్రకటించిన ఐఎస్‌టిఎస్ చార్జీల, ప్రసార నష్టాల మినహాయింపుల ప్రయోజనాలు వినియోగదారులకు దక్కకుండా పోతున్నాయి. ఆ మినహాయింపులకయ్యే వ్యయం కూడా సిఇఆర్‌సి కనీసపాటి నిజాయితీ లేకుండా అనుసరిస్తున్న అడ్డగోలు విధానంతో విద్యుత్ వినియోగదారులపై పడుతున్నది. అంటే, మోడి ప్రభుత్వం ప్రకటించిన మినహాయింపులు మిధ్యగా మారాయి. ఇలాంటి మినహాయింపులను ఇస్తున్నట్లు ప్రకటించిన మోడి ప్రభుత్వం అవి అమలు జరగకుండా చేసి వినియోగదారులకు ప్రయోజనం కల్పించినట్లు ప్రచారం చేసుకుంటూ టోకరా వేస్తున్నది. అదాని ప్రాజెక్టుల, అలాంటి ఇతర ప్రాజెక్టుల సౌర విద్యుత్ చార్జీలు ఇలాంటి మినహాయింపులతో చవకగా ఉంటాయని మభ్యపెట్టడానికి మోడి ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తున్నది.



> మోడి ప్రభుత్వం, సిఇఆర్‌సి ఇలాంటి మోసపూరిత వైఖరులతో వ్యవహరించటం వల్ల, ప్రకటించిన ఐఎస్‌టిఎస్ చార్జీల, ప్రసార నష్టాల మినహాయింపుల ప్రయోజనాలు వినియోగదారులకు దక్కకుండా పోతున్నాయి. ఆ మినహాయింపులకయ్యే వ్యయం కూడా సిఇఆర్‌సి కనీసపాటి నిజాయితీ లేకుండా అనుసరిస్తున్న అడ్డగోలు విధానంతో విద్యుత్ వినియోగదారులపై పడుతున్నది. అంటే, మోడి ప్రభుత్వం ప్రకటించిన మినహాయింపులు మిధ్యగా మారాయి. ఇలాంటి మినహాయింపులను ఇస్తున్నట్లు ప్రకటించిన మోడి ప్రభుత్వం అవి అమలు జరగకుండా చేసి వినియోగదారులకు ప్రయోజనం కల్పించినట్లు ప్రచారం చేసుకుంటూ టోకరా వేస్తున్నది. అదాని ప్రాజెక్టుల, అలాంటి ఇతర ప్రాజెక్టుల సౌర విద్యుత్ చార్జీలు ఇలాంటి మినహాయింపులతో చవకగా ఉంటాయని మభ్యపెట్టడానికి మోడి ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తున్నది.

అదాని సౌర విద్యుత్ ప్రసారానికి ఐఎస్‌టిఎస్ చార్జీలు, ప్రసార నష్టాలకు యూనిట్‌కు కనీసం రూ.2.20 అవుతుందని కన్సల్టెంట్లు, ఇంజనీర్ల అంచనా. దాని ఆధారంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత జులై తొమ్మిదిన రాష్ట్రంలో విద్యుత్ రంగ పరిస్థితిపై విడుదల చేసిన శ్వేత పత్రంలో సెకి ద్వారా కొనే సౌర విద్యుత్‌కు జిఎన్‌ఎ (ఐఎస్‌టిఎస్) చార్జీల నిమిత్తం ఏడాదికి రూ.3000-3500 కోట్ల మేరకు అదనపు భారం పడుతుందని అంచనా చూపారు. అంటే, 25 ఏళ్ళలో ఈ అదనపు భారం రూ.75,000-87,500 కోట్ల మేరకు ఉంటుంది. ఇదిగాక, అదాని సౌర విద్యుత్ కొనుగోలు వల్ల, అధిక రేటు, సెకి కమిషన్, థర్మల్ విద్యుత్ బ్యాకింగ్ డౌన్‌కు చెల్లించాల్సిన స్థిర చార్జీలు, మార్కెట్లో విద్యుత్ కొనుగోలుకు అయ్యే అదనపు వ్యయం, రాష్ట్ర సరిహద్దు నుండి రాష్ట్రమంతటా ఆ విద్యుత్ సరఫరాకు అదనంగా అయ్యే ప్రసార, పంపిణీ నష్టాలు, తదితరాలను కలుపుకుంటే, 25 ఏళ్ళలో అదనపు భారం ఇంకా చాలా అధికంగా ఉంటుంది. మోడి ప్రభుత్వం ప్రకటించిన మినహాయింపులు అమలు కావు గనకే చంద్రబాబు నాయుడు ఈ అదనపు భారాల అంచనాలను శ్వేత పత్రంలో చూపారు. అదాని సౌర విద్యుత్ కొనుగోలుకు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని యూనిట్‌కు రూ.5కు పైగా భారం వినియోగదారులపై పడుతుంది.

గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రకటించిన పునరుత్పత్తి అయ్యే విద్యుత్ విధానంలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిదారులకు అనేక రాయితీలను, మినహాయింపులను, ప్రోత్సాహకాలను ప్రకటించారు. అయితే, వాటికయ్యే వ్యయాన్ని ఎవరు భరించాలనేది పేర్కొనకుండా దాటవేశారు. అప్పటి ఎపిఈఆర్‌సి కూడా వాటికి సంబంధించి జారీ చేసిన రెగ్యులేషన్‌లలో ఆ వ్యయాన్ని ఎవరు భరించాలనేది పేర్కొనకుండా దాటవేసింది. ఆచరణలో ఆ భారాలన్నిటిని వినియోగదారులపై మోపుతూ వస్తున్నారు. ఆవిధంగా మోడి, చంద్రబాబు ఒక తానులోని ముక్కలే. శ్వేత పత్రంలోను, దానిని విడుదల చేస్తూ మీడియాతో మాట్లాడినపుడు చంద్రబాబు అదాని పేరును, మోడి ప్రభుత్వ టోకరాను ప్రస్తావించకపోవటం గమనార్హం.

/ వ్యాసకర్త విద్యుత్ రంగ నిపుణులు /

కొనసాగుతున్న 'మహా' ప్రతిష్టంభన

న్యూఢిల్లీ/ముంబయి : మరాఠా పీఠంపై కొనసాగుతున్న ప్రతిష్టంభన సోమవారం పదో రోజుకు చేరింది. బుధవారం జరిగే పార్టీ శాసనసభాపక్ష సమావేశానికి పరిశీలకులుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీని బిజెపి అధిష్ఠానం ముంబయి పంపుతోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే తన షెడ్యూల్ సమావేశాలను రద్దు చేసుకున్నారు. మరో కీలక నేత, ఎన్‌సిపి అధినేత అజిత్ పవార్ మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై, మంత్రిత్వ శాఖలపై బిజెపి నాయకత్వంతో చర్చలు జరిపేందుకు ఢిల్లీ వెళ్లారు. ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న బిజెపి సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రి షిండేకు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

ముఖ్యమంత్రి పదవికి ఫడ్నవీస్ పేరు ఖరారైందని బిజెపి సీనియర్ నేత ఒకరు పిటిఐ వార్తాసంస్థకు తెలిపారు. ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో ఈ నెల ఐదవ తేదీన ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవన్‌కులే ప్రకటించారు. ఏక్‌నాథ్ షిండే గొంతు ఇన్‌ఫెక్షన్, జ్వరంతో బాధపడుతుండడంతో సోమవారం జరగాల్సిన మహాయుతి నేతల భేటీ వాయిదా పడింది. ఆయన ఇంకా సతారాలోని తన స్వగ్రామంలోనే ఉన్నారు. మహాయుతి నేతలు మంగళవారం సమావేశమై మంత్రుల శాఖల కేటాయింపుపై ఓ నిర్ణయానికి వస్తారని సమాచారం. ఉప ముఖ్యమంత్రి పదవి కావాలని డిమాండ్ చేస్తున్నట్లు వస్తున్న వార్తలను షిండే కుమారుడు, శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే తోసిపుచ్చారు. ఈ వార్తలు నిరాధారమని అంటూ మంత్రి పదవికి తాను పోటీలో లేనని స్పష్టం చేశారు.

కావాలనే మానవతా సాయాన్ని అడ్డుకుంటున్న ఇజ్రాయిల్

• నార్వే శరణార్థుల మండలి విమర్శ • రికార్డు సంఖ్యలో బాల వికలాంగులు



గాజాలో ఆహారం కోసం పోటీపడుతున్న పాలస్తీనా వాసులు

గాజా : పాలస్తీనియన్ల కోసం గాజాలోకి వస్తున్న మానవతా సాయాన్ని కావాలనే ఇజ్రాయిల్ అడ్డుకుంటోందని నార్వే శరణార్థుల మండలి విమర్శించింది. ప్రతి వారం గాజాకు 25 ట్రక్కుల వరకు సరఫరాలు అవసరం కాగా, కేవలం 10 లేదా 11 ట్రక్కులు మాత్రమే వస్తున్నాయని తెలిపింది. ప్రతి వారం గాజాలోకి చాలా తక్కువగా సహాయక ట్రక్కులు ప్రవేశించేలా చూస్తూ, ప్రజలను చలిలో వుంచి, ఆకలి దప్పులతో మరణించేలా చూడడం ఇజ్రాయిల్ లక్ష్యంగా వుందని విమర్శించింది. వరుసగా సహాయ కాన్వాయ్‌లపై దాడులు కొనసాగుతుండడంతో ప్రస్తుతానికి సహాయం పంపడాన్ని ఆపివేస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ పేర్కొంది. ఈ పరిస్థితుల్లో రాఫా సరిహద్దు క్రాసింగ్‌ను తిరిగి తెరిపించే ప్రతిపాదనపై కైరోలో ప్రత్యర్థి పాలస్తీనా గ్రూపులు ఫతా, హమాస్ చర్చిస్తున్నాయి. మరోవైపు ఉత్తర జబాలియా శరణార్థ శిబిరంపై, దక్షిణాన అబసన్ అల్ కబీరా శిబిరంపై దాడులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గాజాలో సగటున ప్రపంచంలో ఎక్కడా లేని రీతిలో బాల వికలాంగులు వున్నారని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఏడాదికి పైగా కొనసాగుతున్న దాడుల కారణంగా గాజాలో లక్షల సంఖ్యలో చిన్నారులు అవయవాలు కోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకుతున్నారని పేర్కొంది. చాలామందికి అనస్థీషియా లేకుండానే సర్జరీలు చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని, చిన్నారుల బాధలు వర్ణనాతీతమని యుఎన్ చీఫ్ గుటెరస్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలను కైరో కాన్ఫరెన్స్‌లో ఆయన డిప్యూటీ చదివి వినిపించారు.

ఉత్తర గాజా నుండి పాలస్తీనియన్లను బహిష్కరించేందుకు చర్యలు : ఇజ్రాయిల్ మాజీ మంత్రి

గాజాలో ఇజ్రాయిల్ దాడులను, చర్యలను యుద్ధ నేరాలు, మారణహోమంగా ఇజ్రాయిల్ మాజీ రక్షణ మంత్రి మోషే యాలోన్ పేర్కొన్నారు. ఆయన ఇజ్రాయెల్ మీడియాతో మాట్లాడుతూ, ఉత్తర గాజా నుండి పాలస్తీనియన్లను బహిష్కరించాలని, అక్కడ యూదుల స్థావరాలను పునరుద్ధరించాలని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. మోషే 2013-16 నుండి నెతన్యాహు ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా పనిచేశారు.

వ్యవస్థీకృత నేరంగా బియ్యం అక్రమ రవాణా

- కాకినాడ పోర్టు భద్రతకు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసరు
- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రేషన్ బియ్యం అక్రమ రవాణాను వ్యవస్థీకృత నేరంగా పరిగణించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కింజరాపు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్‌తో కూడిన మంత్రివర్గ ఉప సంఘం భేటీ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రివర్గ ఉప సంఘం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కాకినాడ పోర్టులో భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలని, ఇందులో భాగంగా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసరును నియమించాలని నిర్ణయించింది. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కాకినాడ పోర్టు, పరిసర ప్రాంతాల్లో రవాణా కార్యకలాపాలపై నిఘాను కట్టుదిట్టం చేయనున్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో బియ్యం ఎగుమతి చేస్తున్న స్టెల్లా నౌకపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. స్థానికంగా పోర్టులోని ఐదు వేర్ హౌస్‌లలో సార్టెక్స్ మిషన్ల అంశంపై కూడా చర్చించారు. వేర్ హౌస్‌లలో యంత్రాలను ఏ విధంగా ఏర్పాటు చేశారని మారిటైమ్ బోర్డు, కాకినాడ పోర్టు అధికారులను మంత్రులు ప్రశ్నించారు. సార్టెక్స్ యంత్రాల ఏర్పాటుపై విచారణ చేపట్టాలని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి, శాంతి భద్రతల ఐజి, సివిల్ సప్లైస్‌శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎమ్‌డి, మారిటైమ్ బోర్డు సిఇఒ, కస్టమ్స్, కాకినాడ పోర్టు అధికారులు, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థపై మల్లగుల్లాలు

- పునర్ వ్యవస్థీకరణపై సబ్ కమిటీ?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరణ చేయడానికి ప్రభుత్వం తాజాగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసే పనిలో ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఎలా ముందుకెళ్లాలనే అంశంపై ప్రభుత్వం ఇతమిద్ధంగా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నట్లు సమాచారం. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో టెక్నికల్, విద్యార్హత అధికంగా ఉన్నవారి సేవలను ఆయా శాఖల మాతృ సంస్థల్లో ఉపయోగించుకుంటే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో నడుస్తోంది. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించకపోవడంతో పునర్ వ్యవస్థీకరణ అంశం ఇప్పట్లో ఉండకపోవచ్చనే అభిప్రాయం సచివాలయ ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిఎం చంద్రబాబు, ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామితో కలిసి గ్రామ, వార్డు సచివాలయాల ఉన్నతాధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రభుత్వం ముందుంచిన ప్రతిపాదనలకు సిఎం సుముఖత వ్యక్తం చేయలేదని సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు మరోసారి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తామని సిఎం పేర్కొన్నట్లు తెలిసింది. ఈసారి సమావేశానికి వచ్చేటప్పుడు నూతన ప్రతిపాదనలతో ముందుకు రావాలని జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారులను సిఎం ఆదేశించినట్లు తెలిసింది. అందరికీ ఆమోదయోగ్యమైన ప్రతిపాదనల ఆమోదం కోసం ప్రత్యేకంగా కేబినెట్ సబ్ కమిటీని నియమించాలనే అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ కమిటీ సమర్పించే నివేదికను ఆధారంగా చేసుకుని విధి విధానాల ప్రకారం ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. సమీక్షలో పంచాయతీకి ఒక సచివాలయం లేదా 5 వేల జనాభాకు ఒక క్లస్టర్ ఏర్పాటుచేసి సరిపడా సిబ్బందిని నియమిస్తే ఎలా ఉంటుందనే అంశంపై చర్చ జరిగినట్లు తెలిసింది. మిగిలిన సచివాలయ సిబ్బందిని రేషనలైజేషన్ చేస్తే ఎలా ఉంటుందనే అంశంపై కూడా చర్చించారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ప్రమోషన్ల గురించి కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం. గతంలో చేసిన క్యాస్ట్ సర్వే, సోషల్ ఆడిట్ కోసం సచివాలయాల్లో డిస్‌ప్లే చేయడం, అనంతరం ఆ డేటా పథకాలకు ఉపయోగించే అంశంపై చర్చ జరిగింది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎలా చేస్తే బాగుంటుందనే అంశంపై గ్రౌండ్ రియాల్టీ ప్రతిబింబించే విధంగా ఆలోచన చేయాలని అధికారులకు సిఎం సూచించినట్లు తెలిసింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రతిరోజూ మూడు సార్లు తప్పనిసరి చేయాలని ఆశించింది. సచివాలయ వ్యవస్థ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఉద్యోగులను వీలైనంత వరకు సొంత నియోజకవర్గం కాకుండా అటు ఇటు మార్చితే ఎలా ఉంటుందనే అంశంపైనా ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు సమాచారం.

22న పివి సింధు వివాహం



న్యూఢిల్లీ : ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పివి సింధు వివాహం ఈ నెల 22న ఉదయ్‌పూర్‌లో జరగనుంది. ఈ విషయాన్ని సింధు కుటుంబ సభ్యులు సోమవారం వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన వెంకట దత్త సాయిని ఆమె వివాహం చేసుకోనున్నట్లు తెలిపారు.

వెంకట దత్త సాయి ప్రస్తుతం పోసిడెక్స్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్‌గా పని చేస్తున్నారు. ఇరు కుటుంబాలకు సుదీర్ఘకాలం నుంచి పరిచయం ఉందని సింధు తండ్రి పివి రమణ తెలిపారు. ఈ నెల 20 నుంచి వివాహ సంబంధిత కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఉంటుందని తెలిపారు.

డోలీలో ఆస్పత్రికి గర్భిణి తరలింపు

ప్రజాశక్తి- దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా)

రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ శివారు బోడిగరువు గ్రామానికి చెందిన గిరిజన గర్భిణి సాహు శ్రావణిని డోలీ కట్టి మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించాల్సి వచ్చింది. ఆమెకు సోమవారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో అక్కడకు అంబులెన్స్ వచ్చే వీల్లేకుండా పోయింది. దీంతో, కుటుంబీకులు, స్థానికులు డోలీ మోతతో ఆమెను శారదా నది దాటించి దేవరాపల్లిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వం ఈ గ్రామానికి రూ.2 కోట్లతో రోడ్డు సౌకర్యం కల్పించేందుకు పూనుకుంది. ఆ తర్వాత ఎన్నికలొచ్చాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డు విషయాన్ని విస్మరించడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డోలీ మోతలు ఉండబోవని చంద్రబాబు చెప్పారని, ఆయన నేతృత్వాన టిడిపి కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి ఆరు నెలలు అవుతున్నా డోలీ మోతలు తప్పడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న అన్నారు. రోడ్డు సౌకర్యం కల్పించి గిరిజనుల కష్టాలు తీర్చాలని ఆయన కోరారు.

అండర్-19 ఆసియా కప్‌లో భారత్ బోణీ

సెంచరీతో రాణించిన కెప్టెన్ మహ్మద్ అమన్

జపాన్‌పై 211 పరుగుల తేడాతో ఘన విజయం



షార్జా: అండర్-19 ఆసియా కప్‌లో భారత్ బోణీ కొట్టింది. జపాన్‌పై యువ భారత్ 211 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 339 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారీ లక్ష్యఛేదనలో జపాన్ 50 ఓవర్లలో 128/8కి పరిమితమైంది. దీంతో భారత్‌కు భారీ విజయం సొంతమైంది. ఓపెనర్ హ్యూగో కెల్లీ (50: 111 బంతుల్లో) టాప్ స్కోరర్. ఛార్లెస్ హింజ్ (35) రాణించాడు. మిగతా బ్యాటర్లెవరూ పెద్ద స్కోర్లు చేయలేదు. భారత బౌలర్లలో హార్దిక్ రాజ్, కార్తికేయ, చేతన్ శర్మ తలో రెండు వికెట్లు తీయగా.. యుధజిత్ ఒక వికెట్ పడగొట్టాడు.

అదరగొట్టిన అమన్

భారత కెప్టెన్ మహ్మద్ అమన్ (122 : 118 బంతుల్లో 7 ఫోర్లు) శతకం బాదడంతో జట్టుకు భారీ స్కోరు దక్కింది. ఓపెనర్ ఆయుష్ మాత్రే (54 : 29 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. వైభవ్ సూర్యవంశీ (23 : 23 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. కార్తికేయ (57 : 50 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో మెరిశాడు. చివర్లో హార్దిక్ రాజ్ (25 : 12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. యువ భారత్ తన తర్వాతి మ్యాచ్ డిసెంబరు 4న యుఎఇతో ఆడనుంది.

46 ఏళ్లలో ఇదే తొలిసారి

- 15.5 ఓవర్లు..5 పరుగులు
- వెస్టిండీస్ బౌలర్ సంచలన రికార్డు



జమైకా : వెస్టిండీస్ సీమర్ జేడెన్ సీల్స్ సంచలన రికార్డు నమోదు చేశాడు. టీమిండియా స్టార్ పేరిట ఉన్న అరుదైన రికార్డును అతడు బద్దలు కొట్టాడు. టెస్ట్ క్రికెట్‌లో ఈ మైల్‌స్టోన్ నమోదవడం 46 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 15.5 ఓవర్లు వేసిన సీల్స్.. కేవలం 5 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అతడు వేసిన ఓవర్లలో 10 ఓవర్లు మెయిడిన్లు ఉండటం విశేషం. తన స్పెల్‌లో ఓవర్‌కు సగటున 0.32 చొప్పున పరుగులిచ్చాడు సీల్స్. గత 46 ఏళ్లలో ఇంత తక్కువ ఎకానమీతో ఓ స్పెల్ వేయడం ఇదే తొలిసారి. కనీసం 10 ఓవర్లను ప్రాతిపదికగా తీసుకుని వేసిన స్పెల్స్‌లో సీల్స్ టాప్‌లో నిలిచాడు.

ఉమేశ్‌ను దాటేశాడు

1978 నుంచి ఇప్పటివరకు ఏ బౌలర్ కూడా టెస్టుల్లో 0.4 కంటే తక్కువ ఎకానమీతో బౌలింగ్ చేయలేదు. కానీ తాజాగా బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో సీల్స్ 0.32 ఎకానమీని నమోదు చేసి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఈ లిస్ట్‌లో ఉన్న టీమిండియా వెటరన్ పేసర్ ఉమేశ్ యాదవ్ (0.42 ఎకానమీ)ని అతడు దాటేశాడు. 2015లో డర్బన్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఉమేశ్ ఈ రికార్డును నెలకొల్పాడు. దాన్ని సీల్స్ అధిగమించాడు. ఇక, బెస్ట్ ఎకానమీ స్పెల్స్‌లో చూసుకుంటే.. భారత మాజీ ఆటగాడు బనూ నద్కర్ణీ అగ్రస్థానంలో ఉన్నాడు. 1964లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్‌లో అతడు 32 ఓవర్లలో 27 మెయిడిన్లు వేయడమే గాక కేవలం 5 పరుగులు మాత్రమే ఇచ్చాడు.

పిసిబి నిర్ణయాన్ని తప్పుబట్టిన షోయబ్ అక్తర్

- ఛాంపియన్స్ ట్రోఫీ



ఇస్లామాబాద్ : భవిష్యత్‌లో భారత్‌లో నిర్వహించే ఐసిసి టోర్నీలకు వెళ్లకూడదన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిర్ణయాన్ని ఆ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్ వ్యతిరేకించారు. వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా నిర్వహించే ఛాంపియన్స్ ట్రోఫీపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఆ దేశంలో పర్యటించేది లేదని ఇప్పటికే బిసిసిఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించడానికి ససేమిరా అంటూ వచ్చిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఎట్టకేలకు దిగొచ్చింది. పాక్‌లో పర్యటించడానికి భారత్ నిరాకరిస్తున్న నేపథ్యంలో ఐసిసి చెప్పినట్లే ఆ జట్టు మ్యాచ్‌లను తటస్థ వేదికలో నిర్వహించ లా హైబ్రిడ్ పద్ధతికి అంగీకరిస్తామని పిసిబి తాజాగా పేర్కొంది. కానీ ఈ విషయంలో పాక్ బోర్డు ఓ మెలిక పెట్టింది. భవిష్యత్తులో తమ జట్టు కూడా ఐసిసి టోర్నీల కోసం భారత్‌కు వెళ్లకూడదని నిర్ణయిస్తే.. ఆ మ్యాచ్‌లను తటస్థ వేదికల్లో నిర్వహించేలా తమకు హామీ ఇవ్వాలని పేర్కొంది. అయితే.. ఈ నిర్ణయాన్ని ఆ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్ వ్యతిరేకించాడు. ఓ క్రీడా ఛానల్‌తో మాట్లాడుతూ ఛాంపియన్స్ ట్రోఫీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించే ఈ టోర్నీ రెవెన్యూలో అధిక వాటాను పిసిబి డిమాండ్ చేయడాన్ని షోయబ్ అక్తర్ సమర్థించాడు. ఇది సరైన నిర్ణయమేనని పేర్కొన్నాడు. భవిష్యత్‌లో ఐసిసి ఈవెంట్‌ల కోసం భారత్‌కు వెళ్లకూడదన్న వైఖరిపై మాత్రం అభ్యంతరం వ్యక్తం చేశాడు. వారిని సొంతగడ్డపైనే ఓడించేలా పాక్ జట్టును నిర్మించాలని కోరాడు.

హైబ్రిడ్ మోడల్‌లోనే ఛాంపియన్స్ ట్రోఫీ!

ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై సందిగ్ధత తొలగినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ ఆతిథ్యం ఇస్తున్న ఈ మెగా టోర్నీ హైబ్రిడ్ మోడల్‌లో జరగనున్నట్లు సమాచారం. అయితే మొన్నటివరకు ఛాంపియన్స్ ట్రోఫీ జరగడం అనుమానంగా సాగింది. పాకిస్థాన్‌కు ఎట్టిపరిస్థితుల్లోనూ టీమిండియాను పంపించబోమని బిసిసిఐ స్పష్టం చేయడం, మరోవైపు హైబ్రిడ్ మోడల్‌లోనే టోర్నీ నిర్వహిస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పట్టుబట్టడంతో.. టోర్నీ నిర్వహణపై అనిశ్చితి ఏర్పడింది. ఇక హైబ్రిడ్ మోడల్‌లో ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించడం దాదాపు ఖాయమైంది. భారత్ ఆడే మ్యాచ్‌లకు దుబాయ్ వేదిక కానున్నట్లు సమాచారం. భారత్ సెమీస్, ఫైనల్ వరకు చేరుకుంటే. ఆ మ్యాచ్‌లను కూడా అక్కడే నిర్వహిస్తారు.

జైళ్లు, పోలీస్ స్టేషన్లలో సిసి కెమెరాల పనితీరు చెప్పండి

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు (1001), జైళ్లు (81)లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల అమలుపై నివేదిక ఇవ్వాలని డిజిపి, జైళ్లశాఖ డిజిలను హైకోర్టు ఆదేశించింది. ఎన్ని పనిచేస్తున్నాయో, ఎన్ని పనిచేయడం లేదో, ఇంకా ఎన్ని ఏర్పాటు చేయాలో పూర్తి వివరాలు ఇవ్వాలంది. విచారణను ఈ నెల 23కు వాయిదా వేస్తూ, జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఆదేశించింది. పిఎస్‌లు, జైళ్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని 2015లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ న్యాయవాది తాండవ యోగేష్ 2019లో పిల్ దాఖలు చేశారు. రాష్ట్రంలో ఉన్న 1001 పోలీస్ స్టేషన్లలో 10 వేలు, 81 జైళ్లలో 1,752 చొప్పున సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎసిపి) టి విష్ణుతేజ చెప్పారు.

చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం

- చిరు వ్యాపారుల మీదికి దూసుకెళ్లిన సిమెంట్ లారీ
- నలుగురు మృతి, పలువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని ఆలూరు స్టేజీ వద్ద సిమెంట్ లారీ బీభత్సం సృష్టించింది. వేగంగా వచ్చిన లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చిరు వ్యాపారుల మీదికి దూసుకెళ్లింది. ఈ ఘోర ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఒకరు మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేసుకుని క్షతగాత్రులను దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం ఆలూరు గేటు వద్ద హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై పలువురు కూరగాయల వ్యాపారం సాగిస్తుంటారు. సోమవారం సాయంత్రం కూడా కూరగాయల వ్యాపారం కొనసాగింది. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వస్తున్న సిమెంట్ లారీ అతి వేగంగా వచ్చి ఆలూరు గేటు వద్దకు రాగానే అదుపు తప్పి కూరగాయలు అమ్ముతున్న వారిపైకి దూసుకెళ్లింది. ఒక్కసారిగా లారీ దూసుకురావడంతో ఆ ప్రాంతమంతా ఉలిక్కిపడింది. వ్యాపారులపై నుంచి వెళ్లిన లారీ అంతే వేగంగా చెట్టును ఢీకొట్టడంతో చెట్టు కూలిపోయింది. ఈ ఘటనలో ఆలూరు గ్రామానికి చెందిన నక్కలపల్లి రాములు(45), విద్యార్థి దమరగిద్ద కృష్ణ(25), ఇంద్రారెడ్డినగర్‌కు చెందిన సుజాత (38) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన ఒకరిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరొకరు మృతిచెందారు. ఇతని వివరాలు తెలియాల్సి ఉంది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఈ ఘటనలో హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై బీభత్స వాతావరణం నెలకొంది. స్థానికులు క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలకు నేతల పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలను, క్షతగ్రాతులను పలువురు నాయకులు పరామర్శించారు. ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామేన భీంభరత్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణరెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తామన్నారు. గాయపడిన వారికి ఉచితంగా వైద్యం అందిస్తామని తెలిపారు. సిఎంతో చర్చించి త్వరలో రోడ్డు పనులను ప్రారంభించేలా చూస్తామన్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఆదుకుంటామని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మృతులంతా రైతులు కావడం బాధాకరం అన్నారు.



చిరువ్యాపారులపైకి దూసుకెళ్లిన లారీ

రాజీ ఎలా చేసుకున్నారు?

- హోంమంత్రి అనితపై చెక్‌బౌన్స్ కేసులో హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

తనపై నమోదైన చెక్‌బౌన్స్ కేసులో ఇరుపక్షాల మధ్య రాజీ కుదిరిందని హైకోర్టును హోంమంత్రి వంగలపూడి అనిత ఆశ్రయించారు. ఫిర్యాదుదారు, తన మధ్య రాజీ కుదిరిన నేపథ్యంలో విశాఖలోని 7వ స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులోని కేసును కొట్టేయాలని ఆమె కోరారు. ఏ విధంగా రాజీ చేసుకున్నారో వివరించకపోవడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. అనిత తనకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వలేదంటూ కింది కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసిన వేగి శ్రీనివాసరావుతో స్వయంగా మాట్లాడింది. ఎంత మొత్తానికి రాజీ కుదిరిందో ఆరా తీసింది. కింది కోర్టులో తప్పుడు కేసు వేశారనే అభియోగాల మాటేమిటని ప్రశ్నించింది. కింది కోర్టులోని కేసును ఏం చేస్తారని కూడా ప్రశ్నించింది. దీనిపై శ్రీనివాసరావు.. తాను అనితపై తప్పుడు కేసు పెట్టలేదని, డబ్బు కోసం తిరగలేక రాజీ చేసుకున్నట్లు చెప్పారు. అనిత తరపున న్యాయవాది సతీష్ కల్పించుకుని రాజీ జరిగినందున శ్రీనివాసరావు తనపై దాఖలు చేసిన చెక్‌బౌన్స్ కేసును కింది కోర్టులో కొనసాగించరాదన్నారు. దీనిపై హైకోర్టు.. ఇదెలా రాజీ అవుతుందని, పోరాటం చేయకపోవడం వల్ల రాజీ చేసుకోవడం ఎలా అవుతుందని కూడా ప్రశ్నించింది. రాజీని రికార్డ్ చేయడానికి వీలుగా అన్ని వివరాలు తమకు నివేదించాలని అనితను ఆదేశించింది. ఈ నెల 10న జరిగే విచారణకు శ్రీనివాస్‌రావు ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ సోమవారం ఆదేశించారు. అనిత 2015 అక్టోబరు ఒకటిన వేగి శ్రీనివాసరావు నుంచి ఎన్నికల ఖర్చుల నిమిత్తం రూ.70 లక్షలు అప్పు తీసుకున్నారు. ఆ మొత్తం తీర్చకపోవడంతో 2018లో అనితపై శ్రీనివాసరావు సూట్ వేశారు. ఇటీవల అనిత హోంమంత్రి అయ్యారు. ఇరుపక్షాల మధ్య రాజీ కుదిరిందని ఆమె హైకోర్టును ఆశ్రయించారు.

రైల్వేలో ఎన్నికల హడావుడి

- పోటాపోటీగా ప్రచారం
- ఉద్యోగుల సమస్యలే ప్రధాన ఎజెండా : ఎస్‌సిఆర్‌ఎంయు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దక్షిణ మధ్య రైల్వేలో గుర్తింపు సంఘం కోసం మరో రోజులో ఎన్నికలు జరగనున్నాయి. రైల్వే నిబంధనల ప్రకారం మొత్తం ఓట్లలో 30 శాతం వస్తే సంఘం గుర్తింపు సంఘమవుతుంది. దీనికోసం నెల రోజుల నుండి పెద్దయెత్తున సంఘాల ప్రచారం నిర్వహిస్తున్నాయి. విజయవాడ వంటి చోట్లయితే రైల్వేస్టేషన్ పరిసరాలన్నీ సంఘాల బ్యానర్లతో నిండిపోయాయి. సాధారణ ఎన్నికల హడావుడిని తలపిస్తున్నాయి. నాలుగో తేదీ నుండి జరిగే ఎన్నికల్లో జోన్ పరిధిలో సుమారు 80 వేలమంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో విజయవాడ డివిజన్లో 17,577 మంది సభ్యులున్నారు. ఇక్కడ ప్రధానంగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సిఆర్‌ఎంయు), సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ (ఎస్‌సిఆర్‌ఇయు) మధ్య పెద్దయెత్తున పోటీ నెలకొంది. ఇవి కాకుండా రైల్ మజ్దూర్ యూనియన్, ఐఆర్‌ఎంయుతోపాటు ఈ ఏడాది బిజెపి అనుబంధ డిఎంఆర్‌కెఎస్ కూడా పోటీలో ఉంది. అయితే ప్రధానంగా మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ మధ్యే పోటీ నెలకొంది. మజ్దూర్ యూనియన్ తరపున సెక్రటరీ ఎం లీలా, అధ్యక్షులు గుప్తా పెద్దయెత్తున ప్రచారం చేస్తున్నారు. యూనియన్ తరపున ఉద్యోగులకు చేసిన సేవలను వివరిస్తున్నారు. ముఖ్యంగా ఉద్యోగులకు ప్రమాదకరంగా మారిన ఎన్‌పిఎస్ నుండి యూనిఫైడ్ పెన్షన్ సిస్టమ్‌లోకి మార్చడం వెనుక యూనియన్ జాతీయ నాయకులు శివగోపాల్ మిశ్రా నేతృత్వంలో నిర్వహించిన ఆందోళనలను వివరిస్తున్నారు. అలాగే బోనస్‌లను ఇప్పించడంలో మజ్దూర్ యూనియన్ నాయకత్వం పోరాట పటిమే కారణమని ఉద్యోగులకు వివరిస్తున్నారు. ముఖ్యంగా ప్రమోషన్ల విషయంలోనూ, ట్రాక్‌మెన్ల సమస్యల పరిష్కారంలోనూ అత్యంత కీలకంగా వ్యవహరించామని వారు చెబుతున్నారు. అలాగే ట్రాక్ మెయింటేనెన్స్ గ్రేడ్‌పేను ఒకటి నుండి నాలుగుకు తీసుకొచ్చామని వివరించారు. పాయింట్స్‌మెన్ కేటగిరిలోనూ నాలుగు గ్రేడ్లు అమలయ్యేలా చూస్తున్నామని తెలిపారు. వీటిల్లో చాలా వాటికి రైల్వేబోర్డు ఆమోదం తెలిపిందని ఇచ్చిన హామీలు, గుప్తా 2025 నుండి అమలవుతాయని లీలా, గుప్తా తెలిపారు. వ్యక్తిగత స్వార్థం లేకుండా ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేసే సంఘం తమదేనని వారు పేర్కొన్నారు. అలాగే ఎంప్లాయీస్ సంఘ్ తరపున తాము విజయం సాధిస్తామని డివిజన్ సెక్రటరీ ఆకుల రాఘవేంద్ర కూడా తెలిపారు. ఉద్యోగుల కోసం చేసిన సేవలు మర్చిపోలేనివని, వాటిని అందరూ గుర్తుపెట్టుకుంటారని పేర్కొన్నారు.



ఎస్‌సిఆర్‌ఎంయు అధ్యక్షులు గుప్తా



ఎస్‌సిఆర్‌ఎంయు సెక్రటరీ ఎం లీల

హోంగార్డుల పిటిషన్లపై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

కానిస్టేబుల్స్ ఎంపిక ప్రక్రియలో తమను ప్రత్యేక కేటగిరిగా పరిగణించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ పెద్ద సంఖ్యలో హోంగార్డులు వేసిన పిటిషన్లపై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. సోమవారం ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వులో పెడుతున్నట్లు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ప్రకటించారు. సామాజిక, మతపరమైన రిజర్వేషన్లు వర్తింపజేసి ప్రిలిమినరీ పరీక్షలో తమకు క్వాలిఫైయింగ్ మార్కులు రాలేదని చెప్పి అనర్హులుగా ప్రకటించడాన్ని భారీ సంఖ్యలో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ కేసుల్లో గతంలో హైకోర్టు.. తదుపరి ప్రక్రియలైన దేహధారుఢ్య పరీక్షకు, తుది రాత పరీక్షకు అనుమతించాలని పోలీసు నియామక బోర్డుకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. నోటిఫికేషన్లలో హోంగార్డులకు మొత్తం 1,167 పోస్టులు కేటాయింపు జరిగింది. అందులో 382 మంది ప్రాథమిక అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. దీనివల్ల మిగిలిన పోస్టులన్నింటినీ జనరల్ కేటగిరి కింద భర్తీ చేస్తే తమకు అన్యాయం జరుగుతుందని హోంగార్డుల వాదన. మధ్యలో నోటిఫికేషన్ రూల్స్ మార్పుకు వీలుండదని ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ వాదించారు. వాదనల తర్వాత హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతున్న పాలకులు

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేసే కుట్రలో భాగంగా కర్మాగారాన్ని కోలుకోలేనంత నష్టాల్లోకి పాలకులు నెడుతున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1391వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూములను కాజేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తుండడం సరికాదని తెలిపారు. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చేసి కేంద్రంతో మాట్లాడి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని కోరారు.

అదానీకి బంగ్లా షాక్

- విద్యుత్ ధరలు తగ్గించాల్సిందేనని పట్టు

ఢాకా : అదానీ గ్రూపుతో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం కింద ధరలను గణనీయంగా తగ్గించాలని బంగ్లాదేశ్ కోరుతోంది. అదానీ గ్రూప్ చైర్మెన్ గౌతమ్ అదానీపై అమెరికా న్యాయస్థానంలో ఛార్జిషీటు దాఖలైన నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చింది. అమెరికా కోర్టులో ప్రాసిక్యూటర్లు అభియోగాలు నమోదు చేసిన నేపథ్యంలో ఫ్రాన్స్‌కు చెందిన టోటల్‌ఎనర్జీస్ సంస్థ పెట్టుబడులను నిలిపివేసింది. కెన్యా ప్రభుత్వం మౌలిక సదుపాయాల ప్రాజెక్టులన్నింటినీ రద్దు చేసుకుంది. వివిధ ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాల కారణంగా అదానీ గ్రూప్ కంపెనీలు 33 బిలియన్ డాలర్లకు పైగా నష్టపోయాయి.

షేక్ హసీనా ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న ఏడు ప్రధాన ఇంధన, విద్యుత్ ప్రాజెక్టులపై విచారణ జరిపేందుకు దర్యాప్తు సంస్థను నియమించాలని సమీక్షా కమిటీ బంగ్లా ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ ఏడింటిలో అదానీకి సంబంధించిన ప్రాజెక్ట్ కూడా ఉంది. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని ఆపద్ధర్మ ప్రభుత్వం ఈ సమీక్షా కమిటీని నియమించింది. మరోవైపు... 2017లో హసీనా ప్రభుత్వం అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని సమీక్షించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని బంగ్లాదేశ్ హైకోర్ట్ ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది. హసీనా ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం జార్ఖండ్‌లోని గొడ్డా బొగ్గు ప్లాంటులో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను అదానీ పవర్ కంపెనీ బంగ్లాదేశ్‌కు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ కాంట్రాక్టులో ఏవైనా తేడాలు ఉన్నట్లయితే తిరిగి చర్చలు జరుపుతామని బంగ్లాదేశ్ విద్యుత్, ఇంధన సలహాదారు మహమ్మద్ ఫౌజల్ కబీర్ ఖాన్ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు జరిగే విచారణలో అవినీతి, లంచం ఆరోపణలు నిరూపితమైనప్పుడు మాత్రమే ఒప్పందాన్ని రద్దు చేసుకుంటామని ఆయన చెప్పారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇప్పటికే కొన్ని అంశాలను గుర్తించిందని అంటూ విద్యుత్ ప్లాంటుకు ఇచ్చిన కొన్ని ఆదాయపన్ను మినహాయింపుల నుండి తమ దేశం ఎలాంటి ప్రయోజనం పొందడం లేదని వివరించారు.

నోయిడాలో కదంతొక్కిన రైతులు

- ఢిల్లీకి మార్చ్ ప్రారంభం
- భారీ బారికేడ్లతో అడ్డుకున్న పోలీసులు
- దిగొచ్చిన ప్రభుత్వం.. రైతులతో సిఎస్ చర్చలు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో భారీ ప్రాజెక్టుల కోసం భూమలిచ్చిన వారికి పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతు ఆందోళన మళ్లీ మొదలైంది. ఎఐకెఎస్‌తో సహా 10 రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యాన వేలాదిమంది ప్రజలు తలపెట్టిన ఢిల్లీ మార్చ్‌ను యుపి - ఢిల్లీ సరిహద్దుల్లో పోలీసులు అడ్డుకున్నారు. పార్లమెంటు మార్చ్ ప్రకటించారు. దీంతో చర్చలు ఆదిత్యనాథ్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రభుత్వం తమ దగ్గరకు వచ్చి చర్చించాలని, లేకపోతే వెనక్కి తగ్గేది లేదని ఎస్‌కెఎం నేతలు స్పష్టం చేశారు. నేరుగా వచ్చి త్వరలో చర్చలు జరుపుతామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ సింగ్ ప్రకటించడంతో గంటల తరబడి జాతీయ రహదారి దిగ్బంధనం ముగిసింది. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అన్ని డిమాండ్లను ఆమోదించి లిఖితపూర్వక హామీ ఇస్తే తప్ప నమ్మి విరమించేది లేదని ఎస్‌కెఎం ప్రకటించింది.

యమునా ఎక్స్‌ప్రెస్‌వే అథారిటీ, యుపి ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ, పెద్ద ప్రాజెక్టుల కోసం భూమిని ఇచ్చిన రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. దాదాపు 14 ఏళ్లుగా నిరంతరం డిమాండ్ చేస్తున్నప్పటికీ యుపి ప్రభుత్వం వెనుదిరిగి చూడలేదని రైతులు విమర్శించారు. అభివృద్ధి చేసిన భూమిలో 10 శాతం, తగిన పరిహారం, ఉపాధి కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గ్రేటర్ నోయిడాలో ఐదు రోజులుగా జరుగుతున్న ఆందోళన ముగిసిన సోమవారం ఢిల్లీ మార్చ్ ప్రారంభమైంది. గ్రేటర్ నోయిడాలోనే, మార్చ్‌ను ఆపడానికి యుపి పోలీసుల ప్రయత్నాలను మహిళలతో సహా రైతులు ప్రతిఘటించారు. పోలీసు వలయాలు, బారికేడ్లు, ముళ్ల కంచెలు, ఇసుకతో నింపిన కంటైనర్లను నెట్టుకుంటూ రైతులు రాష్ట్ర సరిహద్దుకు చేరుకున్నారు. అనంతరం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి సరిహద్దు వద్ద జాతీయ రహదారి దిగ్బంధనం చేశారు. గౌతమ్ బుద్ధనగర్ వద్ద ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వస్తారన్న ప్రభుత్వ సందేశాన్ని ఎస్‌కెఎం నాయకత్వానికి అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్, అదనపు పోలీసు కమిషనర్ తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వచ్చే వరకు రోడ్డు దిగ్బంధనాన్ని విరమిస్తున్నట్లు నేతలు ప్రకటించారు.

గ్రేటర్ నోయిడా భూసేకరణ బాధిత రైతులకు ఎఐకెఎస్ అభినందనలు

గ్రేటర్ నోయిడా, నోయిడా, యమునా ఎక్స్‌ప్రెస్‌వే, యుపిఎస్ఐడిసి, ఇతర ప్రాజెక్టుల నుండి భూసేకరణ బాధిత రైతులు ప్రారంభించిన మిలిటెంట్ పోరాటాన్ని ఎఐకెఎస్ స్వాగతించింది. రైతులకు అభినందనలు తెలిపింది. ఈ మేరకు ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్ ప్రకటన విడుదల చేశారు. ఐదు రోజులపాటు సంబంధిత ప్రాంతంలో ఆందోళన చేస్తున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో పార్లమెంటుకు తమ నిరసనను తీసుకురావడానికి సోమవారం ఢిల్లీ కూచ్ (మార్చ్ టు ఢిల్లీ) నిర్వహించారు. మహామాయ ఫ్లైఓవర్ నుండి ప్రారంభించి, రైతులు మూడు గంటలపాటు పోలీసులతో పోరాడారని పేర్కొన్నారు. ఢిల్లీ వెళ్లే మార్గంలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు, ముళ్ల వైర్లు, ట్రక్కులు, షిప్పింగ్ కంటైనర్లు మొదలైన బహుళ అడ్డంకులను తొలగించుకుని ముందుకు సాగారని తెలిపారు. ఢిల్లీ - నోయిడా సరిహద్దులో శాశ్వత ఫ్రంట్ ఏర్పాటు చేయాలని రైతులు నిర్ణయించారు. వేలాదిమంది రైతులు ఎక్స్‌ప్రెస్‌వేను అడ్డుకోవడాన్ని చూసి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం దిగొచ్చిందని తెలిపారు.

2026 మార్చి నాటికి పోలవరం 41.15 ఇఎల్ పూర్తికి షెడ్యూల్

- కేంద్ర మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2026 మార్చి నాటికి పోలవరం ఎర్త్ లెవెల్ (ఇఎల్) 41.15 పూర్తి చేయడానికి షెడ్యూల్ చేసినట్లు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి తెలిపారు. రాజ్యసభలో వైసిపి ఎంపి వైవి సుబ్బారెడ్డి, బిజెడి ఎంపి సస్మిత్ పాత్ర అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2014 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే కాలానికి ప్రాజెక్టు నీటిపారుదల భాగానికి సంబంధించిన మిగిలిన ఖర్చులో వంద శాతం భరిస్తోందని తెలిపారు. ప్రస్తుత అంచనా వేసిన టైమ్‌లైన్ ప్రకారం, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కనిష్ట స్థాయి ఇఎల్ 41.15 మీటర్ల వరకు నీటి నిల్వను 2026 మార్చి నాటికి పూర్తి చేయడానికి షెడ్యూల్ చేసినట్లు తెలిపారు. 2021-22లో రూ.2,635.83 కోట్లు, 2022-23లో రూ.906.03 కోట్లు, 2023-24లో రూ.274.93 కోట్లు విడుదల చేశామన్నారు. రెండో సవరించిన అంచనాలో భాగంగా రూ.33,168.24 కోట్లు భూసేకరణ, పరిహారం, పునరావాసం కోసం అంచనా వేసినట్లు తెలిపారు. రూ.22,380.64 కోట్లు పనులు, విద్యుత్ కాంపొనెంట్‌కు అంచనా వేశారని, మొత్తం రూ.55,656.87 కోట్లు (2017-18 ధరల సూచీ) ఈ అంచనాలను సాంకేతిక సలహా కమిటీ 2019 ఫిబ్రవరిలోనే 141వ సమావేశంలోనే ఆమోదించిందని తెలిపారు. అయితే, రివైజ్డ్ కాస్ట్ కమిటీ తన 2024 నివేదికలో ఎర్త్ లెవెల్ 41.15 మీటర్ల వరకు నీటి నిల్వతో పోలవరం నీటిపారుదల ప్రాజెక్టును పూర్తి చేయడానికి సవరించిన వ్యయం కోసం రూ.30,436.95 కోట్లను అంచనా వేసిందని, ఇందులో పరిహారం, పునరావాస కాంపోనెంట్‌లకు రూ.12,270.42 కోట్లు అని తెలిపారు.

జిఆర్‌ఎపి-4 నిబంధనల సడలింపునకు సుప్రీం నో

న్యూఢిల్లీ : ఢిల్లీ, దేశరాజధాని ప్రాంతం(ఎన్‌సిఆర్)లో వాయు కాలుష్యం తీవ్రత తగ్గుముఖం పట్టే వరకూ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి)-4వ దశ నిబంధనలను సడలించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ నిబంధనలను సడలించాలంటే వాయు కాలుష్యం తగ్గుముఖం పట్టాల్సిందేనని సోమవారం స్పష్టం చేసింది. ఈ నిబంధనలు కారణంగా ఉపాధి కోల్పోయిన నిర్మాణ రంగ కార్మికులకు ఏదైనా పరిహారం చెల్లించారా? లేదా? అనే విషయాన్ని తెలియజేయడానికి ఎన్‌సిఆర్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు ఈ నెల 5న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ ముందు హాజరుకావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌తోసహా ఎన్‌సిఆర్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు ఈ నెల 5న మధ్యాహ్నం 3:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకావాలని స్పష్టం చేసింది. జిఆర్‌ఎపి 4వ దశ నిబంధనలను అమలు చేయడం కష్టంగా ఉందా? అని ఢిల్లీ ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. నిబంధనల అమలు కోసం సిబ్బందిని మోహరించడం, దేశరాజధానిలోకి ప్రవేశించకుండా ట్రక్కులను అడ్డుకోవడంలోనూ.. ఇబ్బందులు ఎదరవుతున్నాయా.. అని ప్రశ్నించింది. దీనికి ఢిల్లీ ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది షాదన్ ఫరాసత్ స్పందిస్తూ.. నిబంధనలు పాటించలేదనే ఆరోపణలను పరిశీలిస్తామని చెప్పారు. 1.5 కోట్ల జనాభా ఉన్న నగరంలో 2, 3 సంఘటనల ఆధారంగా నిబంధనలు పాటించడం లేదని చెప్పలేమని ధర్మాసనానికి తెలిపారు.



తీవ్ర ఆందోళనకర అంశం

- బంగ్లా దౌత్య కార్యాలయాలపై దాడికి విదేశాంగ శాఖ ఖండన

న్యూఢిల్లీ : అగర్తలాలోని బంగ్లాదేశ్ అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయంలో భద్రతా నిబంధనలను ఉల్లంఘించి ఆందోళనకారులు ప్రవేశించడాన్ని 'తీవ్ర ఆందోళన కలిగించే సంఘటన' గా విదేశాంగ శాఖ సోమవారం వ్యాఖ్యానించింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ దౌత్య, కాన్సులర్ కార్యాలయాలు దాడులకు లక్ష్యంగా కాకూడదని పేర్కొంది. దౌత్య కార్యాలయాల పవిత్రతను పరిరక్షించడానికి భారత్ కట్టుబడి వుందని విదేశాంగ శాఖ పునరుద్ఘాటించింది. ఈ పరిస్థితుల్లో భారత్‌లోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాలకు భద్రతను పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ఒక ప్రకటన జారీ చేసింది. గత నెల 25న ఇస్కాన్ నేత చిన్మయ్ దాస్‌ను అరెస్టు చేయడంపై హిందూసంఘర్ష్ సమితికి చెందిన ఆందోళనకారులు సోమవారం అగర్తలాలో అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయంలోకి బలవంతంగా చొరబడ్డారు. బంగ్లాదేశ్ జాతీయ పతాకాన్ని లాగివేసి, అక్కడున్న దౌత్య కార్యాలయ బోర్డును ధ్వంసం చేశారు. కొంతమంది నేతలు అసిస్టెంట్ హై కమిషనర్‌కు మెమొరాండం అందచేశారు. ఈలోగా భద్రతా సిబ్బంది వచ్చి బయటకు పంపివేశారు.

80 % పైగా జనరల్ కేటగిరీ ఆచార్యులే

- ఐఐటి, ఐఐఎంల్లో ఎస్‌సి, ఎస్‌టి అధ్యాపకులు చాలా తక్కువ
- ఆర్‌టిఐ డేటా వెల్లడి



న్యూఢిల్లీ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లలో బోధించే అధ్యాపకుల్లో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన వారు చాలా తక్కువ శాతం మందే ఉన్నారు. వీటిల్లో దాదాపు 80 శాతానికి పైగా జనరల్ కేటగిరీకి చెందిన అధ్యాపకులే బోధిస్తున్నారని ఆర్‌టిఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్ - సమాచార హక్కు) ద్వారా వెల్లడైంది. రెండు ఐఐటిలు, మూడు ఐఐఎంల్లో అయితే జనరల్ కేటగిరీ వాటా 90శాతానికి మించిపోయింది. మరో ఆరు ఐఐటిల్లో, నాలుగు ఐఐఎంల్లో జనరల్ వాటా 80-90 శాతం మధ్య వుందని సమాచార హక్కు ద్వారా అందిన సమాచారం తెలియజేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఐఐటి, ఐఐఎంల సంస్థల నుంచి తీసుకున్న సమాచారం మేరకు ఈ విషయాలు వెల్లడయ్యాయి.

ఐఐటి, ఐఐఎంలతోపాటు ఇతర విద్యా సంస్థల్లో అధ్యాపకుల పోస్టుల కోసం కేంద్రం రిజర్వేషన్లను కల్పించింది. ఓబిసిలకు 27 శాతం, ఎస్‌సిలకు 15 శాతం, ఎస్‌టిలకు 7.5 శాతం మేర రిజర్వేషన్లు ఇచ్చారు. వెనుకబడిన తరగతుల వారికి కేంద్రం అవకాశాలు కల్పించినా ఆచరణలో అవి అమలు కావడం లేదు. ఇండోర్ ఐఐఎంలో 109 పోస్టుల్లో 106 పోస్టులు జనరల్ కేటగిరీలోని వారితోనే నడుస్తున్నాయి. ఈ ఐఐఎంలో ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన అధ్యాపకులే లేరని ఆర్‌టిఐ తెలిపింది. ఇక ఉదయ్‌పూర్‌లో కూడా 90 శాతానికి పైగానే, ఐఐఎం లక్నోలో కూడా 95 శాతానికి పైగా జనరల్ కేటగిరీకి చెందినవారే అధ్యాపకులుగా ఉన్నారు. ఆరు ఐఐఎంలను పరిశీలించినట్లైతే ఒక్క ఎస్‌టి కేటగిరికి చెందిన అధ్యాపకులు కూడా లేరు. బెంగళూరు ఐఐఎంలో 85 శాతానికిపైగా జనరల్ కేటగిరీ అధ్యాపకులు ఉన్నారు. అందుకే రిజర్వేషన్లకు తగ్గట్టుగా అధ్యాపకుల్ని నియమించాలని అక్కడ నిరసనలు జరిగాయి.

ఐఐటి ముంబయి, ఐఐటి ఖరగ్‌పూర్‌లలో 700కి పైగా అధ్యాపక పోస్టుల్లో 90 శాతం పదవుల్లో జనరల్ కేటగిరిగికి చెందిన వ్యక్తులే ఉన్నారు. మండీ, గాంధీనగర్, కాన్పూర్, గౌహతి, ఢిల్లీ ఐఐటిల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. 80-90 శాతం మేర జనరల్ కేటగిరీ వారే అధ్యాపకులుగా ఇక్కడ ఉన్నారు. మొత్తంగా 13 ఐఐఎంల్లో 82.8 శాతం మంది అధ్యాపకులు జనరల్ కేటగిరీ వారు వుండగా, కేవలం 5 శాతం ఎస్‌సి, ఒక శాతం ఎస్‌టి, 9.6 శాతం మంది ఓబిసి, ఆర్థికంగా బలహీనపడిన వర్గాలు (ఇబిసి), వికలాంగుల కోటాలకు చెందినవారు అధ్యాపకులుగా ఉన్నారు.

21 ఐఐటిల్లో 80 శాతం జనరల్ కేటగిరీ, 6 శాతం ఎస్‌సి, 1.6 శాతం ఎస్‌టి, 11.2 శాతం ఓబిసి, ఇబిసి, వికాలాంగుల కోటాలకు చెందిన అధ్యాపకులు ఉన్నారు. మొత్తంగా ఐఐటిల్లో గానీ, ఐఐఎంల్లో గానీ ఇంచుమించుగా ఇదే గణాంకాలు ఉన్నాయి.

దేశవ్యాప్తంగా ఐఐటి, ఐఐఎంలన్నింటిలో ఇదే పరిస్థితి నెలకొందని కూడా చెప్పలేమని ఆర్‌టిఐ పేర్కొంది. పాట్నా ఐఐటి అధ్యాపకుల్లో 38 శాతం ఓబిసి, ఎస్సీలు 22 శాతం, ఎస్‌టిలు 13 శాతం, జనరల్ కేటగిరీ 12 శాతం మందే ఉన్నారు. భిలాయ్, ఇండోర్ ఐఐటిల్లో 50 శాతం మంది జనరల్ కేటగిరీ అధ్యాపకులు ఉన్నారు.

జమ్మూలో 51 శాతం జనరల్ కేటగిరీ, 19 శాతం ఎస్‌సి, 5 శాతం ఎస్‌టి, 23 శాతం ఓబిసి, 2 శాతం ఇతర కేటగిరీలకు చెందిన వారు అధ్యాపకులుగా ఉన్నారు. ఏడు ఐఐఎంల్లో 256 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆర్‌టిఐ డేటా తెలిపింది. ఈ పోస్టుల్లో ఓబిసి కేటగిరీకి చెందినవి 88, 54 ఎస్‌సి, 30 ఎస్‌టి కేటగిరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ఐఐటిల్లో 1,557 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 451 ఓబిసి, 234 ఎస్‌సి,, 129 ఎస్‌టి పోస్టులు ఉన్నాయని ఆర్‌టిఐ తెలిపింది.

ఢిల్లీ అల్లర్ల కేసులో ఐదుగురు దోషులుగా నిర్ధారణ

న్యూఢిల్లీ : నాలుగేళ్ల క్రితం ఈశాన్య ఢిల్లీ అల్లర్ల కేసులో హత్యలకు పాల్పడడం, చట్ట విరుద్ధంగా సమావేశమయ్యారనే అభియోగాలపై ఐదుగురిని ఢిల్లీ కోర్టు దోషులుగా నిర్ధారించింది. ఇద్దరిని నిర్దోషులుగా విడుదల చేసింది. 2020లో జరిగిన ఈ కేసులో ఏడుగురు నిందితులపై కేసు నమోదు కాగా అదనపు సెషన్స్ న్యాయమూర్తి పులస్త్య ప్రమచాల విచారించారు. ఢిల్లీ పోలీసుల తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధుకర్ పాండే వాదనలు వినిపించారు. నవంబరు 30న జారీ చేసిన 63పేజీల తీర్పులో కోర్టు ముందున్న సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకున్నారు. 2020 ఫిబ్రవరి 5న చాంద్‌బాగ్‌లోని పీర్ బాబా మజర్‌కు సమీపంలో మొహ్‌సిన్‌ను అల్లరి మూక చంపిందని ప్రాసిక్యూషన్ పేర్కొంది. అల్లరి మూకలో ఈ నిందితులు వున్నారా? లేదా?, మొహసిన్‌ను ఎవరు దారుణంగా హత్య చేశారు అనేది ఈ కేసులో ప్రధాన ప్రశ్నగా మారింది. నలుగురు ప్రాసిక్యూషన్ సాక్ష్యాధారాల ప్రకారం ఈ ఐదుగురు నేరానికి పాల్పడిన ఆ అల్లరి మూకలో భాగస్వాములని కోర్టు పేర్కొంది. మోహ్‌సిన్‌పై దాడికి దిగి గాయపరచడంలో వీరి పాత్ర ఏమిటనేది నిర్దిష్టంగా చెప్పడానికి సాక్ష్యాధారాలు లేవని కోర్టు పేర్కొంది. మిగిలిన ఇద్దరు నిందితులు ఈ అల్లరి మూకలో భాగమని రుజువు కాలేదని పేర్కొంది. ఈ అంశాన్ని 4వ తేదీ విచారణకు వాయిదా వేశారు.

హైకోర్టుకు వెళ్లండి

- సజ్జల భార్గవరెడ్డికి సుప్రీం సూచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైసిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి సజ్జల భార్గవ రెడ్డిని హైకోర్టుకు వెళ్లాలని, అప్పటి వరకు రెండు వారాలపాటు అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు సూచించింది. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులపై రాష్ట్ర ప్రభుత్వం తనపై పెట్టిన కేసులు కొట్టేయాలని సజ్జల భార్గవ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యాకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఏ విషయాలైనా హైకోర్టులోనే చెప్పుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించేందుకు రెండు వారాల సమయం ఇచ్చింది. ఇరుపక్షాల వాదనలు విని తగిన నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ హైకోర్టుకు ఉందని ధర్మాసనం పేర్కొంది.

రెండు కేసుల్లో కుమారుడికి బైడెన్ క్షమాభిక్ష

వాషింగ్టన్ : పలు కేసుల్లో చిక్కుకున్న తన కుమారుడు హంటర్ బైడెన్‌కు అధ్యక్షుడు జో బైడెన్ సోమవారం క్షమాభిక్ష ప్రకటించారు. తాను అధ్యక్షుడిగా వున్నా న్యాయ వ్యవస్థ వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోనని ప్రకటించిన బైడెన్, కుమారుడిపై కేసులు విచారణ, శిక్ష విధింపు సమయాల్లో మౌనంగా వున్నారు. తాజాగా ఆయన తన హామీని ఉల్లంఘించారు. మరికొన్ని వారాల్లో పదవి నుండి వైదొలగనున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. ఒక తండ్రిగా, అధ్యక్షుడిగా తాను ఈ చర్య ఎందుకు తీసుకున్నానో ప్రజలు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. న్యాయ వ్యవస్థలో తనకు విశ్వాసం వుందని, అయితే మురికి రాజకీయాలు ఆ ప్రక్రియను దెబ్బ తీశాయని, అందువల్ల న్యాయం జరగలేదని వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రత్యర్థులు దురుద్దేశపూరితంగా ఈ అభియోగాలు మోపారని, తనను దెబ్బ తీయాలన్నది వారి లక్ష్యంగా వుందని పేర్కొన్నారు. అక్రమంగా ఆయుధాలు కలిగివుండడం, పన్నులను ఎగవేయడం వంటి కేసుల్లో జూనియర్ బైడెన్‌పై డెల్వార్, కాలిఫోర్నియాల్లో అభియోగాలు నమోదయ్యాయి.

గినియా ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఘర్షణలు

- భద్రతా బలగాల కాల్పులతో తొక్కిసలాట
- డజన్ల సంఖ్యలో మృతులు, క్షతగాత్రులు

కొనక్రీ, గినియా : దక్షిణ గినియాలోనే అతిపెద్ద నగరమైన నజెరెకొరెలో సాకర్ మ్యాచ్ సందర్భంగా జరిగిన ఘర్షణలు, తొక్కిసలాటలో పిల్లలతో సహ డజన్ల సంఖ్యలో అభిమానులు మరణించారు. మ్యాచ్ చూసేందుకు వచ్చిన అభిమానులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. ఆ సమయంలో చెలరేగిన ఘర్షణలను అదుపు చేసేందుకు భద్రతా బలగాలు ప్రయత్నించాయి. దాంతో చోటుచేసుకున్న తొక్కిసలాటలో భారీగా ప్రాణ నష్టం సంభవించిందని స్థానిక మీడియా, రాజకీయ పార్టీల కూటమి వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం (డిసెంబరు 2వ తేదీ) ఈ తొక్కిసలాట జరిగిందని గినియా ప్రధాని అమడవు ఒరి బాహ్ ఎక్స్‌లో తెలిపారు. ఎంతమంది మరణించారనే సంఖ్యను నిర్దిష్టంగా వెల్లడించలేదు. అధికారులు ఆ ప్రాంతంలో శాంతి భద్రతలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారని బాహ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో మరణాలు సంభవించాయని, పదుల సంఖ్యలో గాయపడ్డారని రాజకీయ పార్టీల కూటమి నేషనల్ అలయన్స్ ఫర్ అల్టర్‌నేషన్ అండ్ డెమోక్రసీ ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక మీడియా కథనం ప్రకారం సాకర్ మ్యాచ్‌లో వివాదాస్పద పెనాల్టీ విషయం అభిమానులకు ఆగ్రహం తెప్పించింది. కొందరు రాళ్లు విసిరారు. దీంతో, భద్రతా బలగాలు బాష్పవాయు గోళాలను ప్రయోగించాయి. ఈ ఘటనలో పిల్లలుసహా చాలామంది చనిపోయారు. సమీపంలోని ఆస్పత్రిలో గాయపడిన వారు చికిత్స పొందుతున్నారని, వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా వుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

సంఘటనా స్థలంలో వీడియోలను చూస్తుంటే స్టేడియంలో ఒక గ్రూపు గట్టిగా నినాదాలు చేస్తూ రిఫరీ పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఆ వెంటనే పెద్ద ఎత్తున ఘర్షణలు చెలరేగాయి. అభిమానులు పెద్ద పెట్టున ఫీల్డ్‌లోకి పరుగులు పెట్టడం కనిపిస్తోంది. ప్రజలు అటూ ఇటూ పరుగులు పెడుతూ, బాగా ఎత్తుగా వున్న కంచెను దూకి బయటకు వెళ్లిపోవడానికి చాలామంది ప్రయత్నించడం కనిపించింది. ఆ పక్కనే గల ఆస్పత్రిలో నేలపై చాలామంది పడి వుండగా, మరికొంతమంది వారికి చికిత్స విషయంలో సహకరిస్తున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేపట్టాలని నేషనల్ అలయన్స్ పిలుపునిచ్చింది. గినియా మిలటరీ నేత మామడి దౌముబుయా యొక్క చట్టవిరుద్ధమైన, సముచితం కాని రాజకీయ ఆకాంక్షకు మద్దతును సమీకరించేందుకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు.

2021లో అధ్యక్షుడు అల్ఫా కాండెను సైన్యం పదవీచ్యుతుడిని చేసినప్పటి నుండి గినియాలో సైనిక పాలనలోనే వుంది. సైనిక పాలనలో వుంటూ తిరిగి పౌర పాలనకు రాని మాలి, నైజర్, బుర్కినా ఫాసో దేశాల సరసన గినియా చేరింది.

ఖమ్మంలో సిపిఐ వందేళ్ల విజయోత్సవాల ముగింపు

ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో

సిపిఐ వందేళ్ల ముగింపు ఉత్సవాలను ఖమ్మంలో నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా వచ్చే ఏడాది డిసెంబర్ 26న ఖమ్మంలో భారీ ర్యాలీ, పబ్లిక్ మీటింగ్ నిర్వహించనుంది. ఈ మేరకు సోమవారం నాడిక్కడ సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా మీడియాతో మాట్లాడారు. గత నెల 28, 29, 30 తేదీల్లో జరిగిన పార్టీ నేషనల్ కౌన్సిల్ మీటింగ్‌లో తీసుకున్న తీర్మానాలను వెల్లడించారు. ఇందులో భాగంగా పార్టీ వందేళ్ల సెలబ్రేషన్స్‌కు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ విజయోత్సవాలను యుపిలోని కాన్పూర్‌లో ఈ నెల 26న ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే తర్వాత పార్టీ కాంగ్రెస్ మీటింగ్‌ను ఛండీగఢ్‌లో వచ్చే ఏడాది సెప్టెంబరు 21 నుంచి 25 వరకు నిర్వహించాలని తీర్మానం చేసినట్లు వెల్లడించారు. అలాగే డిసెంబర్ 10 వరల్డ్ హ్యూమన్ రైట్స్ డై సందర్భంగా... అదాని ముడుపుల వ్యవహారంపై పార్లమెంట్ జాయింట్ కమిటీ (జెపిసి) వేయాలని దేశ వ్యాప్త ఆందోళనలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మణిపూర్ అల్లర్లపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరిపి, వెంటనే అక్కడ మోహరించిన బలగాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అల్లర్లకు బాధ్యత వహిస్తూ ప్రభుత్వం రాజీనామా చేయాలన్నారు. ఢిల్లీలో కాలుష్యం కారణంగా ఉపాధి కోల్పోయిన కార్మికులకు ఆర్థిక సహాయం అందించాలన్నారు.

చైనాలో నేపాల్ ప్రధాని ఓలి పర్యటన

ఖాట్మండు : నాలుగు రోజుల అధికార పర్యటన నిమిత్తం నేపాల్ ప్రధాని కెపి శర్మ ఓలి సోమవారం చైనా బయలుదేరి వెళ్ళారు. ఈ పర్యటన సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయి పరస్పర ప్రయోజనాలు కలిగిన వివిధ అంశాలపై చర్చిస్తారు. చైనా ప్రధాని లీ కియాంగ్ ఆహ్వానం మేరకు బయల్దేరిన ఓలి ఆయనతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఓలి వెంట 39మంది సభ్యులతో ప్రతినిధి బృందం కూడా వెళ్ళింది. 2008లో ప్రచండ కూడా తొలిగా చైనాలో పర్యటించారు. ఈ పర్యటనా సమయంలో ఉభయ పక్షాలు బిఆర్ఐ ప్రాజెక్టుల పునరుద్ధరణకు కొత్త ప్రణాళికపై చర్చిస్తారని భావిస్తున్నారు.

కొనసాగుతున్న ఫెంగల్ తుపాను బీభత్సం

- కొండచరియలు విరిగిపడి ఐదుగురి మృతి
- ఇద్దరు గల్లంతు
- పలు రైళ్ల రద్దు
- తమిళనాడు, పుదుచ్చేరిలో పంటలకు భారీ నష్టం



తమిళనాడులోని ఉత్తంగరై హైవే వద్ద వరద ఉధృతికి కొట్టుకుపోతున్న బస్సులు

చెన్నై : తమిళనాడు, పుదుచ్చేరిలో ఫెంగల్ తుపాను బీభత్సం కొనసాగుతోంది. తమిళనాడులో తిరువన్నమలై పట్టణం అన్నమలైయర్ హిల్ వద్ద ఆదివారం సాయంత్రం నివాస భవనంపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో భవనంలో ఉన్న ఏడుగురిలో ఐదుగురి మృతదేహాలను సోమవారం వెలికితీశారు. మిగిలిన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. మృతుల్లో ఒక మహిళ, ఒక చిన్నారి ఉన్నారు. స్థానికుల సమాచారం ప్రకారం ఈ భవనంలో రాజ్‌కుమార్, మీనా దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. మీనా సోదరుడి మరో ముగ్గురు పిల్లలు కూడా వీరితో కలిసి ఉంటున్నారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో పాటు స్థానిక పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. చెన్నై ఐఐటి సాంకేతిక నిపుణులు కూడా వీరికి సహాయం చేస్తున్నారు.

ఊటిలో ఇల్లు కూలి ఒక వ్యక్తి మృతి

తమిళనాడు నీలగిరి జిల్లా ఊటీ నొండిమేడు వద్ద భారీ వర్షాల కారణంగా బలహీనపడిన ఇళ్లు సోమవారం తెల్లవారుజామున కూలిపోయిందని, ప్రమాదంలో 45 ఏళ్ల ఆరుముగం మరణించాడని అధికారులు తెలిపారు.

పలు రైళ్ల రద్దు... కొట్టుకుపోయిన వాహనాలు

తమిళనాడులోని విల్లుపురం, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై జిల్లాల్లో దాదాపు 1,29,000 హెక్టార్లలో పంటలు నీట మునిగాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోమవారం తెలిపారు. నష్టంపై సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని, నష్టపోయిన వారందరికీ సాయం అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో సోమవారం విల్లురం జిల్లాలో వరదలు సంభవించాయి. వంతెనలు, రోడ్లు మునిగిపోయాయి. రైల్వే ట్రాక్‌లపై నీరు నిలిచిపోవడంతో కొన్ని రైళ్లను రద్దు చేశారు. క్రిష్ణగిరి జిల్లా ఊతంగరై, పోచంపల్లి తాలుకాల్లో భారీ వర్షాలకు రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించింది. జాతీయ రహదారులకు అనుసంధానం తెగిపోయింది. ఉత్తంగరై హైవేపై పక్కన నిలిపి ఉంచిన బస్సులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ఈ రెండు తాలుకాల్లో మంగళవారం కూడా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఈ జిల్లాల్లో అన్నామలై యూనివర్శిటీ పరీక్షలను వాయిదా వేసింది.

పుదుచ్చేరిలోనూ వర్షాల కారణంగా నలుగురు మరణించారని ముఖ్యమంత్రి ఎన్ రంగసామి తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొరికి రూ 5 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థ కింద 3.54 లక్షల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు సహాయం అందజేస్తామని ప్రకటించారు. బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేస్తామని తెలిపారు. ఈ నెల 3, 5 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను పుదుచ్చేరి యూనివర్శిటీ రద్దు చేసింది. తాజా తేదీలను త్వరలో ప్రకటిస్తామని అసిస్టెంట్ రిజిస్ట్రార్ తెలిపారు. ఈ నెల 6 నుంచి జరగాల్సిన పరీక్షలు యథావిధిగా జరుగుతాయని చెప్పారు.

తుపాను కారణంగా బెంగళూరు ముంపునకు గురైంది. వర్షాలు కురుస్తుండటంతో సోమవారం కూడా రోడ్లపై నీరు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

అల్పపీడనంగా బలహీన పడిన తుపాను

తుపాను సోమవారం ఉదయం 5:30 గంటల సమయంలో అల్పపీడనంగా బలహీనపడిందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ అల్పపీడనం మంగళవారం నాటికి ఉత్తర కేరళ, కర్ణాటక తీరాల్లో తూర్పు-మధ్య అరేబియా సముద్రంలో కలిసి పోయే అవకాశం ఉందని తెలిపింది.

ఏడు కొత్త కేసుల్లో ఇమ్రాన్ ఖాన్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ ఇటీవల నిర్వహించిన ఆందోళనలు, నిరసనలకు సంబంధించి నమోదైన ఏడు కొత్త కేసుల్లో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు తీవ్రవాద నిరోధక కోర్టు 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మరో కేసులో ఆరు రోజులపాటు విధించిన పోలీసు రిమాండ్‌ను పూర్తి చేసిన అనంతరం ఖాన్‌ను అడియాలా జైలుకు తీసుకువచ్చి జడ్జి ముందు ప్రవేశపెట్టారు. విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి అంజాద్ అలీ షా, న్యూ టౌన్ పోలీసు స్టేషన్ కేసుతోపాటు మరో ఆరు కేసుల్లో ఖాన్ జ్యుడీషియల్ రిమాండ్‌ను ఆమోదించారు. గతేడాది పాకిస్తాన్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌పై దాడికి సంబంధించి ఖాన్‌ను అరెస్టు చేశారు. మిగిలిన ఆరు కేసుల్లో ఖాన్ భౌతిక రిమాండ్ కోసం పోలీసులు అభ్యర్థించినా న్యాయమూర్తి తిరస్కరించారు. ఈ కేసులన్నీ సెప్టెంబరు 28, అక్టోబరు 5 మధ్యే నమోదయ్యాయి. గత నెల్లో రెండవ తోషఖానా కేసులో ఆయనకు బెయిల్ లభించిన తర్వాత న్యూ టౌన్ పోలీసు స్టేషన్ కేసులో రావల్పిండి పోలీసులు ఖాన్‌ను అరెస్టు చేశారు. అవిశ్వాస తీర్మానంతో 2022లో ఖాన్ ప్రభుత్వం పడిపోయినప్పటి నుండి ఆయనపై డజన్ల కొద్దీ కేసులు నమోదవుతునే వున్నాయి.

అదానిపై ప్రధాని మౌనం వీడాలి

(మొదటిపేజీ తరువాయి)

జరగ్గా, బుధ, గురువారాల్లో రోజుకు 14 నిమిషాలు, శుక్రవారం 20 నిమిషాలు మాత్రమే జరిగాయి. రాజ్యసభలో గత సోమవారం 33 నిమిషాలు కార్యకలాపాలు జరగ్గా, బుధవారం 13 నిమిషాలు, గురువారం 16 నిమిషాలు, శుక్రవారం 13 నిమిషాలే నమోదయ్యాయి.

చర్చ నుంచి ప్రభుత్వం పారిపోతోంది : ప్రతిపక్షాలు

అమెరికా కోర్టులో గౌతమ్ అదానిపై ఛార్జ్‌షీట్, నలుగురు మరణాలకు దారితీసిన సంభాల్ హింసతోసహా సమస్యలపై పార్లమెంటులో చర్చలు జరగకుండా ప్రభుత్వం తప్పించుకుందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అదాని, మణిపూర్, సంభాల్, అజ్మీర్‌లపై తక్షణ చర్చకు ఇండియా బ్లాక్ పార్టీలు నోటీసులు ఇచ్చాయని, కానీ మోడీ ప్రభుత్వానికి పార్లమెంటు పనిచేయడం ఇష్టం లేదని విమర్శించాయి. అందుకే చర్చకు కేంద్రం అంగీకరించటం లేదని పేర్కొన్నాయి. 'ఈ పరిస్థితి నిజంగా అసాధారణమైనది. ప్రతిపక్షం చర్చను కోరుతోంది. కానీ ప్రభుత్వం దాని నుండి పారిపోతోంది' అని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ అన్నారు.

రాజ్యాంగంపై చర్చకు అంగీకారం!

పార్లమెంట్ ఉభయ సభల్లో రాజ్యాంగంపై చర్చకు ప్రభుత్వం, ప్రతిపక్షాలు అంగీకరించాయని, మంగళవారం నుంచి లోక్‌సభ, రాజ్యసభ సజావుగా సాగుతాయని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు విశ్వాసం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ ప్రతిష్టంభనను తొలగించేందుకు అధికార బిజెపి, ప్రతిపక్ష పార్టీలు సోమవారం అంగీకారానికి వచ్చినట్లు తెలిసింది. పార్టీల ఫ్లోర్ లీడర్లతో స్పీకర్ ఓం బిర్లా సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన కిరణ్ రిజిజు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 13, 14 తేదీల్లో లోక్‌సభలోనూ, ఈ నెల 16, 17 తేదీల్లో రాజ్యసభలోనూ రాజ్యాంగంపై చర్చ జరగనుందని చెప్పారు.



మీకోసం

ఐదు మిరియాలు, రెండు యాలకులు, చిన్న దాల్చిన చెక్క ముక్కను మెత్తటి పొడిలా చేసుకొని, ఐదు నిమిషాలు మరిగించాలి. ఆపై ఫిల్టర్ చేసుకుని, ఒక చెంచా తేనె కలిపి ప్రతి రోజూ ఉదయాన్నే తాగడం వల్ల గొంతులో పేరుకుపోయిన కఫం కరిగిపోతుంది.

జీవన సౌరభం

చిన్నప్పుడు మంచి అలవాట్లు చేసుకుంటేనే పెద్దయ్యాక గొప్ప లక్ష్యాలను సాధించగలరు.

మహిళలపై హింస.. దుష్ప్రభావాలు

ప్రకృతిలో ఏ జీవి కూడా కారణం లేకుండా మరొక జీవిపై దాడి చేయదు. క్రూర మృగాలు కూడా ఆకలి తీర్చుకోవడం కోసం మాత్రమే వెంటాడతాయి. ఆకలి లేనప్పుడు పక్కనుంచి పోతున్న చిన్న చిన్న జంతువులను కూడా ఏమీ చేయవు. కానీ మెదడు బాగా అభివృద్ధి చెందిన, జ్ఞానం పొందిన మనిషి మాత్రం కేవలం తన స్వార్థం కోసం, తాత్కాలిక సంతోషం కోసం ఎంతటి హింసకైనా సిద్ధంగా ఉంటాడు, ఎదుటి వారి ప్రాణాలు అంతే అవలీలగా తీయగలడు. వీటికి రాజకీయ, సామాజిక, ఆర్థిక కారణాలు కూడా కలిస్తే హింస మరింత ఎక్కువవుతుంది.



డాక్టర్ సిహెచ్.శారద
సెల్ : 9966430378

ఒక్కోసారి అకస్మాత్తుగా ఏదైనా ప్రమాదం, అత్యాచారం, యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాల వంటివి జరిగినప్పుడు షాక్‌కి గురై మనసు కొంతసేపు మొద్దుబారిపోతుంది. కొంతమంది వెంటనే జరుగుతున్నది తెలుసుకుని తప్పించుకునే ప్రయత్నం చేస్తారు. చాలాసార్లు మహిళపై పురుషుడు చేసే దాడుల నుంచి తప్పించుకునే అవకాశం ఉండదు. ఒక్కోసారి ఆ షాక్ నుంచి బయటకు రావడానికి కొన్ని వారాలు, నెలలు కూడా పట్టొచ్చు. గాయాల వల్ల అసలు మామూలు స్థితికి రాలేకపోవడం, ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంది. ప్రపంచం అభివృద్ధి వైపు దూసుకుపోతున్న నేటి హైటెక్ యుగంలో మహిళగా జీవితంలో ప్రతి దశలోనూ ఏదో ఒక రూపంలో హింసను ఎదుర్కొంటోంది. ఐక్య రాజ్య సమితికి చెందిన రెండు సంస్థలు రోజుకు సగటున 140 మంది బాలికలు, మహిళలు బంధువులు లేదా భర్త చేతుల్లో మరణిస్తున్నారని; 2023లో 51 వేల 300 మంది మరణానికి తమ కుటుంబ సభ్యులే కారణమని చెప్పింది. కాలంతో పాటే మహిళపై హింస కూడా పెరుగుతుంది. దీనికి కుటుంబంతో పాటు సమాజం, రాజ్యం కూడా కారణమే అవుతుంది. మహిళలు ఎదుర్కొనే హింసలో లైంగికదాడి మరింత ప్రమాదకరమైనది. ఎక్కువగా భర్త లేదా సన్నిహిత భాగస్వామి, తెలిసిన వారే ప్రధాన నిందితులుగా ఉంటారు. వీటివల్ల బాధితురాలు మానసికంగా, శారీరకంగా దీర్ఘకాలంపాటు ఆరోగ్య సమస్యలను భరించాల్సి వస్తుంది. దాడికి గురైన ఆమె ఒక్కతే కాదు; పిల్లలు, కుటుంబ సభ్యులు, చుట్టూ ఉన్న సమాజం కూడా భరించాలి. ఆమె వ్యక్తిగత ఆరోగ్యం దెబ్బతింటుంది. పని శ్రద్ధగా చేయలేని అశక్తత వల్ల ఉపాధి పోయి ఒక్కోసారి కుటుంబం రోడ్డున పడుతుంది


ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ... జనాభాలోని ప్రతి ముగ్గురు 15– 49 ఏళ్ళ వయసు మహిళల్లో ఒకరు అంటే 33 శాతం మంది ఏదో ఒక రకంగా లైంగిక హింసకు గురవుతున్నారు. ఈ దారుణాల్లో 40 శాతం బాగా తెలిసిన వాళ్ళ వల్ల జరుగుతున్నాయి. ప్రతి మహిళా తన జీవితంలో ఒక్కసారైనా ఏదో ఒక రకంగా లైంగిక వేధింపులకు గురయ్యే ఉంటుంది. మన అనుకున్న వారితోనే ప్రమాదం అంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం జష్ట్రఅశ్రీస ూాఎబంవూాష్ట్ర కింద లైంగికత గురించి ఏ మాత్రం అవగాహన, గ్రహింపు లేని వయసు వారితో, వారి సమ్మతి లేకుండా అత్యాచారం చేయడం నేరం. ూశీషంశీ చట్టం 18 ఏళ్ళ లోపు వయసున్న పిల్లల శరీర భాగాలను తాకటం, లైంగిక చర్యను సూచించే మాటలు, సైగలు, అశ్లీల చిత్రాలు చూపించడం వంటివి నేరం. ఈ చట్టాలేవీ నెలల పసికందులపై జరిగే అత్యాచారాలను ఆపలేకపోతున్నాయి. ఒక సర్వే ప్రకారం 50 శాతం కన్నా ఎక్కువ మంది పిల్లలు మానసిక, లైంగిక వేధింపులకు గురవుతున్నారు. దారుణం తర్వాత అయినా చాలామంది తల్లితండ్రులు రిపోర్టు చేయడానికి కూడా రావడం లేరు. కుటుంబ పరువు, మర్యాద పోతుందని వారి భయం.

లైంగిక దాడిలో బాధితురాలికి గాయాలవుతాయి. నిర్భయ, హత్రాస్, కథువా, ఆర్‌జి కార్‌లో డాక్టర్‌పై అత్యాచారాలు గురించి విన్నప్పుడు అంత దారుణంగా మనిషి అనేవాడు ప్రవర్తిస్తారా అనే అనుమానం వస్తుంది. దాదాపు అన్ని అవయవాలను ప్రమాదకరంగా గాయపరచడం, ఎముకలు విరిచేయడం వంటి అమానుషాలను ఈ సంఘటనల్లో చేశారు. అటువంటి దాడిలో బాధితులు బతికే అవకాశం తక్కువే. ఒక అమ్మాయి జీవితాన్ని అర్ధంతరంగా ముగించే అధికారం వాళ్ళకు ఎవరు ఇచ్చారు ? మనదేశంలో అప్రకటిత రాజ్యాంగంగా చెలామణి అవుతున్న మనుస్మృతి బోధించిన పురుషాధిక్య భావజాలం, స్త్రీని బానిసగా చూసే మనస్తత్వం మహిళను ఇలాగే ఉండాలంటుంది. ఈ లైంగిక దాడులకు అసాంఘిక వ్యక్తిత్వం, మద్యం డ్రగ్స్ వంటి చెడు అలవాట్లు, నిందితులకు అండగా నిలబడే నీచ రాజకీయ నాయకులు, కామాంధులను కాపాడే నేటి న్యాయ వ్యవస్థ ... అన్నీ కారణాలే! స్త్రీని లైంగిక వస్తువుగా చూసినంత కాలం ఈ హింస తగ్గదు. లైంగిక హింసకు గురైన మహిళలు గాయాల వల్ల బ్లీడింగ్, కడుపునొప్పి వంటి తీవ్ర సమస్యలు కాకుండా దీర్ఘకాలిక శారీరక, మానసిక, భావోద్వేగ పరమైన సమస్యలను ఎదుర్కొంటారు. గర్భధారణ సమస్యలు, ఒకవేళ గర్భిణి అయితే అబార్షన్ కావడం, కడుపులోని శిశువు ఎదగడంలో లోపాలు, బరువు తక్కువ బిడ్డలు పుట్టడం, కావల్సిన సమయం కన్నా ముందే డెలివరీ కావడం, లేదా బిడ్డ చనిపోయి పుట్టడం వంటివి జరుగుతాయి. కుటుంబ సభ్యులతో గొడవలు, ఒత్తిడి, మైగ్రేన్ తలనొప్పి, నిద్రలేమి, ఆకలి లేకపోవడం డిప్రెషన్, హత్య లేదా ఆత్మ హత్యా ప్రయత్నం కూడా చేస్తారు. HIV, ఇంకా ఇతర లైంగిక వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. పసిపిల్లలు లైంగిక దాడికి గురైతే, తమపై ఆ దాడి జరిగిందనే అవగాహన కూడా వారికి ఉండదు. నొప్పి అని ఏడవడం, సరిగా తినకపోవడం వల్ల పోషకాహార లోపాలు, తగినంత పెరుగుదల లేకపోవడం, చదువులో వెనక పడడం వంటివి బయటికి కనిపిస్తాయి. అసహజ ప్రవర్తన, కారణం లేని కోపం, వత్తిడి, ఇంట్లో, బడిలో కూడా స్నేహితులతో కలవలేకపోవడం, అందరితో గొడవలు పెట్టుకోవడం వంటి లక్షణాలు కూడా కనపడొచ్చు. నిద్రలో భయపడడం, ఏడవడం వంటివి చూసినప్పుడు తల్లితండ్రులు ఓపికగా కారణం తెలుసుకునే ప్రయత్నం చేయాలి. పెద్దపిల్లలు అయితే అసాధారణ లైంగిక ప్రవర్తన, చెడు అలవాట్లవైపు వెళ్ళడం, హింసకు దారి తీసే పనులు చేస్తారు. ఎవరో చేసిన తప్పును పసి బిడ్డలు, కుటుంబ సభ్యులు, సమాజం కూడా భరించ వలసి ఉంటుంది.



అభివృద్ధి చెందిన దేశాల్లో కన్నా మహిళను దేవతగా పూజించాలని చెప్పే మనదేశంలో మహిళలపై హింస, మరణాల శాతం చాలా ఎక్కువ. కట్టుబాట్లు, సాంప్రదాయం, మగవారికి ఎదురు చెప్పకూడదనే భావజాలం... ఎంత చదువుకుని, ఉద్యోగాలు చేస్తున్నా మహిళలకైనా తప్పడం లేదు. మహిళాభివృద్ధి, సమానత్వం, సాధికారత అని నాయకులు చెబుతున్న మాటల్లోని డొల్లతనాన్ని ఇవి చాటి చెబుతున్నాయి. కుటుంబంలో మహిళకు ప్రత్యేక గౌరవం అవసరం లేదు సాటి మనిషిగా చూసుకుంటే చాలు. ఎవరు లైంగిక వేధింపులకు గురైనా సమస్యను అర్థం చేసుకోవడం, వారిపట్ల సానుభూతి చూపడం, కనీస మద్దతు తెలియచేయడం నాగరికులుగా మన కనీస బాధ్యత.



ప్రకృతి

పచ్చని పొలాలు
విరిసిన పూలు
కొలువు తీరిన కొండలు
కళకళలాడే జలపాతాలు
అమూల్యమైన వరాలు


అందమైన ప్రకృతి
అద్భుతమైన ఆలోచనలకి ఆకృతి
అద్భుతాలతో మైమరిపించే ప్రకృతి
ప్రకృతి రమణీయతలు
నయనానందకర దృశ్యాలు
ఆహ్లాదపరిచే అందాలు
భూతలం మెచ్చే ఆనందాలు

మానవుడు చేస్తున్నాడు
ప్రకృతిని వికృతి
ప్రకృతి నాశనంతో
మానవ జీవితం అధోగతి
చెట్ల నరికివేత
నీటి కాలుష్యం
వాయు కాలుష్యం
మానవుడు చేస్తున్న పాపాలు

ప్లాస్టిక్ వ్యర్థాలు
ప్రాణాంతక వ్యాధులు
లోపించిన సహజత్వం
మరణించిన మానవత్వం
గతితప్పెను రుతుచక్రం
మతితప్పెను మన క్రమం
ప్రకృతిని కాపాడుదాం
భూమిని రక్షిద్దాం
పచ్చదనం పెంచుదాం
స్వచ్ఛమైన
గాలి
పీల్చుదాం!



బెందాళం సిద్ధార్థ్,
9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముత్యాల పేట, కవిటి.



తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. అవేంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ



సేలం వినయ్,
ఎంపిపిఎస్, చిల్లకల్లు
జగ్గయ్యపేట, ఎన్‌టిఆర్ జిల్లా.



'సిల్క్ స్మిత' మూవీ గ్లిమ్స్ విడుదల



సోమవారం సిల్క్ స్మిత పుట్టినరోజు సందర్భంగా 'ఎస్‌టిఆర్‌ఐ' సినిమాస్ నిర్మిస్తున్న 'సిల్క్ స్మిత– క్వీన్ ఆఫ్ ద సౌత్' చిత్రం నుండి గ్లిమ్స్‌ని విడుదలచేశారు. ఇందులో చంద్రిక రవి టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. జయరామ్ శంకరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్‌బి విజయ్ అమృతరాజ్ నిర్మిస్తున్నారు. 2025 నుండి ఈ సినిమా షూటింగ్ మొదలు కానుంది. గతేడాది ఆమె పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ విడుదలచేశారు.

'సత్య'కు ఫిలింఫేర్ షార్ట్ ఫిలిం అవార్డు



హృదయాల్ని హత్తుకునేలా నిలిచి అందరి ప్రశంసలు అందుకున్న 'సత్య' షార్ట్‌ఫిలిం ఫిలింఫేర్ అవార్డ్స్–2024లో పీపుల్స్ ఛాయిస్ కేటగిరీలో అవార్డు గెల్చుకుంది. నటీనటులుగా సాయిదుర్గతేజ్, స్వాతిరెడ్డి నటించారు. హర్షిత్, హన్షిత నిర్మాతలుగా వ్యవహరించారు. విజయకృష్ణ వికె దర్శకత్వం వహించారు. మ్యూజికల్ షార్ట్ ఫిలింగా 'సత్య' ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చింది. ఈ అవార్డు గెల్చుకున్న సంతోషాన్ని చిత్రయూనిట్ సోషల్‌మీడియా ద్వారా పంచుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68